www.flashindianews.com
# ఫ్లాష్ ఇండియా
తెలుగు దినపత్రిక
FLASH INDIA TELUGU DAILY
RNI NO.APTEL/2010/33229

విలేకరులు కావలెను
18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 174 | ఆదివారం 16.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-



# ఇతర దేశాలపై ఆధారపడకూడదు

## భారత్ వైపు ప్రపంచం చూస్తోంది..

### భారతదేశ చరిత్రలో అద్భుత దృశ్యం ఆవిష్కృతం, ఎర్రకోటపై మార్మోగిన 'వందేమాతరం'


- 12 ఏళ్లలో ఊహించని వేగంతో దేశ అభివృద్ధి
- ప్రజల కృషితోనే భారత్ పురోగతి సాధిస్తోందన్న మోదీ
- రక్షణ ఉత్పత్తిలో నాలుగు రెట్ల వృద్ధి
- ఖాదీ, గ్రామీణ పరిశ్రమల్లో భారీగా పెరిగిన ఉత్పత్తి
- ఎలక్ట్రానిక్స్ తయారీలో ఏడు రెట్ల వృద్ధి
- ఆధునిక రైల్వే కోచ్‌ల తయారీలో 21 రెట్ల వృద్ధి
- మొబైల్ తయారీలో భారత్ దూసుకెళ్తోందన్న ప్రధాని
- డిజిటల్ లావాదేవీల్లో భారత్‌ది సాంకేతిక విప్లవం
- వికసిత్ భారత్‌తో ప్రపంచం చూసే దృక్పథం మారుతుంది 05

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై ప్రధాని మోదీ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. 'దిమాగీ నక్సల్స్'పై అప్రమత్తంగా ఉండాలని, వారిని గుర్తించి ఏకాకిని చేయాలని యువతకు పిలుపునిచ్చారు. నక్సలిజం పోరాటంలో 3,500 మందికి పైగా భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. జనగణనలో యువత ఒకటి, రెండు గంటల సమయం కేటాయించి చురుగ్గా పాల్గొనాలని కోరారు. కచ్చితమైన జనాభా వివరాల ఆధారంగానే భవిష్యత్ విధానాలు, సంక్షేమ పథకాలు రూపొందుతాయని తెలిపారు. అలాగే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తున్నట్లు ప్రకటించారు. దేశంలో 650కి పైగా కొత్త విశ్వవిద్యాలయాలు ఏర్పాటయ్యాయని, విదేశీ విశ్వవిద్యాలయాల రాకతో యువతకు భారత్‌లోనే విదేశీ డిగ్రీలు పొందే అవకాశం లభిస్తోందని చెప్పారు.



# రైతు సుభిక్షమే రాష్ట్ర సుభిక్షం

## కృష్ణా, గోదావరి జలాల్లో చుక్క నీటినీ వదులుకోం..



**రాష్ట్రంలో 105 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరు చేశాం..**

**నియామకాలను బాధ్యతగా తీసుకున్నాం.. 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశాం..**

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం బిల్లులు
- ఇప్పటివరకు 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు
- యువత కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ
- ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు
- 8 మెడికల్, 16 నర్సింగ్ కాలేజీల ఏర్పాటు
- హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం 02
- రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రెండో దశకు ప్రాధాన్యం
- మూసీ పునరుజ్జీవనం.. చెరువుల పరిరక్షణకు హైడ్రా
- తెలంగాణలో భారీగా పెట్టుబడులు.. ఐటీ ఎగుమతుల్లో వృద్ధి
- 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే ధ్యేయం
- విద్యా పనితీరు ర్యాంకులో తెలంగాణకు మెరుగైన స్థానం
- 93 లక్షలకు పైగా రేషన్ కార్డుల పరిధిలో 3.38 కోట్ల మంది

**32 నెలల్లో దెబ్బతిన్న వ్యవస్థలను గాడిలో పెట్టాం**



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**
కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా దక్కించుకునే విషయంలో వెనకబడేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గోల్కొండ కోటలో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. భారతదేశ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ రోజు మనందరికీ పర్వదినమని, దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజని పేర్కొన్నారు. ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే ఈ స్వాతంత్ర్యమని, ఆ త్యాగాలకు జోహార్లు అర్పిస్తూ మహనీయులందరికీ వినమ్రంగా తలవంచి నమస్కరిస్తున్నానని చెప్పారు.

# నాకు చెప్పే బదులు రేవంత్ రెడ్డికి చెప్పు..!

## వచ్చినోళ్లకు.. చేర్చుకున్నోళ్లకు బుద్ధి లేదు..

- టీకాంగ్రెస్‌లో మరోసారి భగ్గుమన్న అసంతృప్తి
- పార్టీలో పాత నేతలకు ప్రాధాన్యత తగ్గిందన్న రాజగోపాల్ రెడ్డి
- బయటి నేతల ఆధిపత్యం పెరిగిందంటూ సంచలన వ్యాఖ్యలు 03
- రాజగోపాల్ రెడ్డికి టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ హెచ్చరిక
- హద్దు మీరి మాట్లాడొద్దన్న మహేశ్ కుమార్ గౌడ్
- నేను పార్టీ లైన్ దాటలేదు : రాజగోపాల్ రెడ్డి





# జెన్ జీ లారా నిలదీయండి...

## ఏనుగులు మింగేటోడు పోయి పీనుగలు మింగేటోడు వచ్చాడు

- 22ఏ నిషేధిత జాబితా పేరుతో మహా దోపిడీ: బండి సంజయ్
- 95 లక్షల ఎకరాలను 22ఏలో ఎలా పెడతారు?
- ప్రభుత్వం అమ్మిన భూములనూ 22ఏలో పెడతారా? 03
- హెచ్‌ఎండీఏ వేలం వేసిన భూములకు రక్షణ లేదా?
- భూముల తొలగింపు కోసం ఏళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోరా?
- రెండున్నరేళ్లుగా సమస్యను ఎందుకు పరిష్కరించలేదు?




# అసెంబ్లీలో చర్చకు రా..

## ఇది రేషన్ కార్డులు మాత్రమే కాదు

- బీఆర్ఎస్, బీజేపీలు ఒకే నాణేనికి బొమ్మా బొరుసు
- సంక్షేమ పథకాలపై రెండు పార్టీలు ప్రశ్నిస్తున్నాయి
- పదేళ్లు అధికారంలో ఉండి సన్నబియ్యం ఎందుకు ఇవ్వలేదు?
- పేదల ఆకలి తీర్చాలనే ఆలోచన ఎందుకు చేయలేదు?
- 'వరి వేస్తే ఉరే' అన్న కేసీఆర్.. ఫామ్‌హౌస్‌లో మాత్రం వరి వేశారు
- రైతులకు మేలు చేస్తుంటే ఫామ్‌హౌస్‌లో పడుకుని విమర్శలా?
- కేసీఆర్‌కు సంగారెడ్డి గడ్డ నుంచి సీఎం రేవంత్ సవాల్
- రైతుల కోసం చేసిన మేలుపై అసెంబ్లీలో చర్చకు రావాలి 03
- కరెంట్ కోతలపై బీఆర్ఎస్‌ది తప్పుడు ప్రచారం




# డబుల్ ఇంజిన్ గొప్పలేంటి?

## సింగిల్ ఇంజిన్తోనే తెలంగాణ అభివృద్ధి

- కులమతాల పేరుతో రాజకీయాలెందుకు?
- 80 ఏళ్ల తర్వాత కూడా నీళ్లు, రోడ్లు, కరెంటు లేని గ్రామాలా?
- విద్య, ఉపాధి, మౌలిక వసతులపైనే పాలకుల దృష్టి ఉండాలి 05
- కేసీఆర్ పాలనను ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారు
- తెలంగాణ భవన్లో స్వాతంత్ర్య వేడుకల్లో కేటీఆర్ ధ్వజం





# పీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు

## స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటో పెట్టాలని డిమాండ్

- రేషన్ కార్డులపై మోదీ ఫొటో డిమాండ్‌పై మహేశ్ గౌడ్ ఫైర్
- అనవసర అంశాలతో రాజకీయాలు చేయొద్దు
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదు
- అప్పుడు మౌనం.. ఇప్పుడు మోదీ ఫొటో కోసం డిమాండ్
- మోదీ ఫొటో లేకపోతే ఉద్యమం చేస్తామనడం విడ్డూరం
- ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ఎన్నో ఉద్యమాలు చేసింది 05
- ఇలాంటి అర్థంలేని డిమాండ్ల కోసం ఉద్యమాలు చేయం

**విభజన హామీల అమలుపై బీజేపీ దృష్టి పెట్టాలి**

# రైతు సుభిక్షమే రాష్ట్ర సుభిక్షం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా దక్కించే విషయంలో వెనకబడేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గోల్కొండ కోటలో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. భారతదేశ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ రోజు మనందరికీ పరమోత్సవమని, దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజని పేర్కొన్నారు. ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే ఈ స్వాతంత్ర్యమని, ఆ త్యాగాలకు జోహార్లు అర్పిస్తూ మహనీయులందరికీ వినమ్రంగా తలవంచి నమస్కరిస్తున్నానని చెప్పారు. ప్రపంచ చరిత్రలోనే ఆయుధం లేని యుద్ధం మన స్వాతంత్ర్య పోరాటమని, అహింస అనే ఆయుధంతో ఇంత గొప్ప విజయాన్ని సాధించవచ్చని లోకానికి చాటిచెప్పిన ఘనత భారతదేశానిదని గుర్తుచేశారు. ప్రజాస్వామ్య దేశంగా భారత్ నిలబడటానికి ప్రథమ ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ బలమైన పునాదులు వేశారని, దేశం ఆధునిక భారత్‌గా అవతరించడానికి అవసరమైన ప్రాథమిక రంగాలు, పరిశ్రమలకు ప్రాధాన్యం ఇచ్చారని వివరించారు. విధ్వంసమైన తెలంగాణ రూపురేఖలను మళ్లీ నిర్మించి వికసింపజేసే ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం ప్రజలకు స్వేచ్ఛను అందించిందని, రాష్ట్రంలో ప్రతి రంగంలో అధికారం చేపట్టిన 32 నెలల్లో దెబ్బతిన్న వ్యవస్థలను ఒక్కొక్కటిగా సరిచేసి నిలబెట్టామని తెలిపారు. సంక్షేమాన్ని విస్తరిస్తూ, అభివృద్ధికి కొత్త దిశను నిర్దేశిస్తూ భవిష్యత్తు అవసరమైన కార్యాచరణకు పునాదులు వేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వానికి సంక్షేమమంటే ఆర్థిక భారం కాదని, ఖర్చు పెట్టిన రూపాయిలకు లెక్క కట్టడం కాదని, సంక్షేమ ఆలోచనలో మానవీయత, బాధ్యత, ప్రజల్లో ఆనందం నింపాలనే తపన, ఆరోగ్యవంతమైన ప్రజలను అందించే ప్రయత్నం, ఆత్మగౌరవంతో కూడిన జీవన విధానాన్ని అందించే సంకల్పం ఉన్నాయని వివరించారు. ఓట్ల కోసం, రాజకీయం చేయడం కోసం సంక్షేమాన్ని చూడటం లేదని, ప్రతి పథకంలో సామాజిక దృక్పథం ఉందన్నారు. ఈ 32 నెలల కృషి ఫలితాలను ఇస్తోందని, ఆర్‌బిఐ నివేదిక ప్రకారం 2025-26లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931గా ఉంటూ దేశ తలసరి ఆదాయంతో పోల్చితే దాదాపు 91 శాతం అధికంగా ఉందని, ఇది ఆర్థిక వ్యవస్థ బలానికి తిరుగులేని విజమని పేర్కొన్నారు.రైతు సుభిక్షంగా ఉంటే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని గట్టిగా నమ్ముతున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రైతుల కన్నీళ్లు తుడిచి వ్యవసాయాన్ని పండగ చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ. 2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేసి 25 లక్షల మందికి పైగా రైతు కుటుంబాలకు రుణ విముక్తి చేశామని, రైతు భరోసా కింద రూ. 36 వేల కోట్లకు పైగా సాయం అందించామని గుర్తుచేశారు. గత రెండు రోజులలోనే దాదాపు రూ. 9 వేల కోట్లకు పైగా రైతు భరోసా రైతుల ఖాతాలలో జమ చేశామని, సన్నవడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ చెల్లించి అండగా నిలిచామని చెప్పారు. గతించిన 32 నెలల్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు రూ. 1.70 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశామని, వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో తెలంగాణ పంజాబ్‌ను దాటి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలిచిందని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో కొత్త రికార్డు నెలకొల్పామని, గత వానకాలంలో 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా 81.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వివరించారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా దక్కించే విషయంలో వెనకబడేది లేదని, అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందిస్తామని స్పష్టం చేశారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, తెలంగాణలో ప్రతి ఇంట ఆడబిడ్డలను మహాలక్ష్ములు చేయడమే లక్ష్యమని సీఎం వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలందరికీ ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఇప్పటికే 335 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయని, రోజుకు 34 లక్షలకు పైగా మహిళలు ఈ సదుపాయాన్ని వాడుకుంటూ రూ. 11 కోట్లకు పైగా ఆదా చేసుకుంటున్నారని తెలిపారు. గృహజ్యోతి ద్వారా 53.09 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ 10.97 కోట్ల సున్నా బిల్లులు జారీ చేశామని, 42.90 లక్షల కుటుంబాలకు రూ. 500 కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని చెప్పారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా 1.68 లక్షల మంది ఆడబిడ్డలకు సాయం అందించేందుకు రూ. 4,709 కోట్లు ఖర్చు చేశామన్నారు. స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ ద్వారా రూ. 60,487 కోట్ల రుణాలు అందించామని, వడ్డీలేని రుణాల కింద రూ. 1,900 కోట్ల వడ్డీని విడుదల చేశామని తెలిపారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల విక్రయానికి శిల్పారామంలో ప్రదర్శనలు ఏర్పాటు చేశామని, మహిళలు పాఠశాల యూనిఫాంలు కుడుతూ, సోలార్ పంపులు, మహిళా విద్యుత్ బస్సులను నిర్వహిస్తూ ఆర్టీసీ బస్సులకు యజమానులుగా ఉన్నారని కొనియాడారు.

**ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మిస్తున్నాం**

విద్యా రంగంలో చేపట్టిన సంస్కరణల వల్ల కేంద్రం ప్రకటించిన పనితీరు గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరిందని సీఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రతి నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మిస్తున్నామని, ఇప్పటి వరకు 105 పాఠశాలలకు మంజూరు ఇచ్చామని చెప్పారు. గోల్కొండ వేదికగా త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు, తెలంగాణ పబ్లిక్ పాఠశాలలను ప్రారంభించామని, డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 212 శాతం పెంచామని వివరించారు. 22 లక్షల మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందిస్తూ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నామని తెలిపారు. 11 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామని, ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రూ. 1,000 కోట్లు కేటాయించామని పేర్కొన్నారు. సామాజిక భద్రతలో భాగంగా సన్నబియ్యం పంపిణీ ఓ విప్లవాత్మక పథకమని, 93 లక్షలకు పైగా రేషన్ కార్డులు, 3.38 కోట్ల మంది ప్రజలను ప్రజా పంపిణీ వ్యవస్థ పరిధిలోకి తీసుకువచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు జారీ చేసి రాష్ట్రవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తున్నామని, రేషన్ పంపిణీలో పారదర్శకతను పెంచుతున్నామని వివరించారు. పేదల ఆత్మగౌరవ ప్రతీకలుగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామని, మొదటి దశలో 4.50 లక్షల ఇండ్లకు ఆమోదం తెలిపి ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల సాయం అందిస్తున్నామని, రెండో విడతలో 2.50 లక్షల కొత్త ఇండ్లకు మంజూరు చేశామని తెలిపారు. హైదరాబాద్ నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు లక్ష ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్నామని, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ నుంచి ఇందిరమ్మ ఇండ్ల టవర్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామని వెల్లడించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు తదితర 43 లక్షల మందికి సామాజిక భద్రత పింఛన్లు అందిస్తున్నామని, డిసెంబర్ 2023 నుంచి జులై 2026 వరకు పింఛన్ల కోసం రూ. 30,089 కోట్లు పంపిణీ చేశామని తెలిపారు. కొత్తగా 2.25 లక్షల మంది అర్హులకు పింఛన్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. సామాజిక న్యాయంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, దేశంలోనే సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వేను పకడ్బందీగా నిర్వహించి సామాజిక వర్గీకరణ నివేదికలు రూపొందించామని సీఎం స్పష్టం చేశారు. 59 ఎస్సీ ఉపకులాలను వర్గీకరించి, ఎస్సీ ఉపకులాల వర్గీకరణను అమలు చేసిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభలో ఆమోదించి కేంద్రానికి పంపించామని చెప్పారు. బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి 12.4 శాతం కేటాయించామని పేర్కొన్నారు. పదిహేనేళ్ల తరువాత కనీస వేతనాల సవరణను ఆమోదించి 11 లక్షల మంది కార్మికులకు ప్రయోజనం చేకూర్చామని, వేతనాలను రూ. 16 వేల నుంచి రూ. 20 వేల వరకు పెంచామని వివరించారు. గిగ్ కార్మికుల సంక్షేమ చట్టం అమలుకు శ్రీకారం చుట్టామని, వయోవృద్ధుల సంరక్షణలో ఉద్యోగుల బాధ్యతను నిర్దేశిస్తూ ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చామని తెలిపారు.

**ఇప్పటివరకు 72 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చాం**

ఉద్యోగ నియామకాలను ప్రభుత్వం అత్యంత కీలక బాధ్యతగా తీసుకుందని, ఇప్పటి వరకు 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పూర్తి చేశామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, మెగా డీఎస్సీ నియామకాలను విజయవంతంగా నిర్వహించి నియామక పత్రాలు అందించామని తెలిపారు. యువతకు నైపుణ్యం, ఉద్యోగాలు కల్పించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలను అప్‌గ్రేడ్ చేస్తున్నామని వివరించారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ అకాడమీ, యంగ్ ఇండియా డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ స్కిల్లింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే తెలంగాణ వేదికగా యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ 2026 నిర్వహించబోతున్నామని చెప్పారు.వైద్యరంగంలో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచామని, నిమ్స్‌లో 2,000 పడకల నూతన ఆసుపత్రి నిర్మాణంతో పాటు వరంగల్, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మిస్తున్నామని తెలిపారు. కొత్తగా 8 మెడికల్ కళాశాలలు, 16 నర్సింగ్ కళాశాలలు, 28 పారామెడికల్ కళాశాలలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. దక్షిణ భారతదేశంలోనే తొలి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్ నిర్వహణ ఇందుకు నిదర్శనమని, ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 5.18 లక్షల మందికి రూ. 2,526 కోట్ల సాయం అందించామని వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులకు సరికొత్త సాంకేతికత, వనరులను అందిస్తున్నామని సీఎం చెప్పారు. సైబర్ నేరాలు, ఆహార కల్తీని ఎదుర్కొనేందుకు డ్రగ్స్ కంట్రోల్, సైబర్, ఆహార కల్తీ నియంత్రణలను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తున్నామని తెలిపారు. ఓఆర్‌ఆర్‌పై ప్రమాదాలు తగ్గించేందుకు హైవే ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సెంటర్లు, మహిళల భద్రతకు షీ టీమ్స్, పిల్లల అనుకూల న్యాయస్థానాల ఏర్పాటులో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల శ్రద్ధతో నిర్ణయాలు తీసుకుంటున్నామని, పీఆర్‌సీ, పెన్షన్లు, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ వంటివి అమలు చేస్తున్నామని తెలిపారు. 36 సచివాలయ శాఖల్లో 100 శాతం ఈ-ఆఫీస్ అమలు చేశామని, ఈ నెల 17వ తేదీ నుండి అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో 'ప్రజావాణి' ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రెండో దశ, మూసీ పునరుజ్జీవనం, చెరువుల పరిరక్షణకు 'హైడ్రా' ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నామని సీఎం వివరించారు. పారిశ్రామికంగా టి-ఐడియా ద్వారా రూ. 1.29 లక్షల కోట్ల పెట్టుబడులు, తెలంగాణ గ్లోబల్ ఏఐ సమ్మిట్ ద్వారా రూ. 5.75 లక్షల కోట్ల ఒప్పందాలు సాధించామని, 2025-26లో ఐటీ ఎగుమతులు రూ. 3.97 లక్షల కోట్లకు చేరాయని వెల్లడించారు. తొలి సమగ్ర టూరిజం పాలసీ 2025 తీసుకువచ్చామని, సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను మార్చాలనే సంకల్పంతో 'తెలంగాణ రైజింగ్-2047' దిశగా అడుగులు వేస్తున్నామని, అందరి సహకారంతో రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని సీఎం ప్రసంగాన్ని ముగించారు.

# నక్సల్స్ రహిత భారత్ మన ఘన విజయం..

**న్యూ ఢిల్లీ :** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ దేశ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశాన్ని నక్సల్స్ రహితంగా మార్చడం దేశం సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటని ఆమె కొనియాడారు. బస్తర్ వంటి సున్నిత ప్రాంతాల్లో జరుగుతున్న వేగవంతమైన అభివృద్ధి, అక్కడి ప్రజల సాంస్కృతిక భాగస్వామ్యం ఈ మార్పునకు నిదర్శనమని పేర్కొన్నారు. ఉగ్రవాదులు, వారికి వెన్నుదన్నుగా నిలిచే వారు ఎక్కడ దాక్కున్నా తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని రాష్ట్రపతి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. సరిహద్దుల్లో ఉగ్రవాద నెట్‌వర్క్‌లను నెలమట్టం చేయడంలో భారత సాయుధ దళాల ఖచ్చితమైన లక్ష్య ఛేదన సామర్థ్యాన్ని 'ఆపరేషన్ సిందూర్' ప్రపంచానికి చాటిచెప్పిందని రాష్ట్రపతి ప్రశంసించారు.దేశంలో న్యాయవ్యవస్థ పాత్రను ప్రస్తావిస్తూ.. వనరులు, ఆర్థిక స్తోమత లేకపోవడం వల్ల ఏ ఒక్క పౌరుడు న్యాయానికి దూరం కాకుండా చూడాల్సిన బాధ్యత న్యాయ వ్యవస్థతో ముడిపడి ఉన్న ప్రతి ఒక్కరిపైనా ఉందని రాష్ట్రపతి స్పష్టం చేశారు. సామాన్యులకు సైతం సత్వర న్యాయం అందినప్పుడే నిజమైన ప్రజాస్వామ్య విలువలు పరిరక్షించబడతాయని గుర్తుచేశారు. భారత్ 80 వ వసంతంలోకి అడుగు పెడుతున్న ఈ పవిత్ర శుభవేళ..

దేశ రక్షణ, అంతర్గత భద్రత, సమగ్రాభివృద్ధి దిశగా యావత్ భారతావని ఐక్యంగా ముందుకు సాగాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు.

# కస్తూర్బా గాంధీ బాలికల విద్య నిలయంలో జెండా ఆవిష్కరణ



**నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** కోడేరు మండల కేంద్రంలో ఈరోజు కస్తూర్బా గాంధీ బాలికల విద్యా నిలయములో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు విద్యాబుద్ధులు బోధించారు నేటి బాలలే రేపటి పౌరులు భారత మాత నుదుటి రాతను మార్చే శక్తి ఒక్క విద్యకే ఉందని అలాగే మీరు క్రీడా పరంగా గాని కళాపరంగా ఎదిగి మున్ముందు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన సూచించారు మరియు ఆటపాటల్లో పాల్గొన. విద్యార్థులకు బహుమతులు సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా అందించడం జరిగింది మరియు రైతు వేదిక దగ్గర అగ్రికల్చర్ ఆఫీసర్ సర్పంచ్ గారిని శాలువాతో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొమిరే మాసయ్య గారు వార్డు సభ్యులు ఆది శరత్ బాబు గారు విద్య రామకృష్ణయ్య గారు సోప్పరి సత్యనారాయణ గారు సొప్పరి శ్రీను గారు మరియు సర్పంచ్ గారి అభిమానులు కార్యకర్తలు ప్రజలు ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు

# ఖమ్మంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు..



**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ముందుగా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ పరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ స్వాగతం పలికారు. అనంతరం సాయుధ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గాంధీజీ సారథ్యంలో సాగిన భారత స్వాతంత్ర్య పోరాటం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. మహనీయుల త్యాగాల ఫలితంగా లభించిన స్వాతంత్ర్యానికి అర్థం, పరమార్థం చేకూర్చే విధంగా ప్రజాస్వామ్య పాలనకు పునాదులు వేసుకున్నామని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్వతంత్ర భారతదేశానికి రాజ్యాంగాన్ని రచించి, ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, న్యాయం కల్పించే ప్రజాస్వామ్య పాలనకు బలమైన పునాదులు వేశారని పేర్కొన్నారు. ఆ మహనీయుల ఆశయాల స్ఫూర్తితో 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం అన్ని రంగాల్లో వేగంగా ముందుకు సాగుతోందన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ఖమ్మం జిల్లా సాధిస్తున్న పురోగతిని ఈ సందర్భంగా వివరించారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అడిషనల్ డీసీపీ 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రామానుజం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, పోలీస్, హోంగార్డు, మినిస్టీరియల్ స్టాఫ్ సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# మహిళా శక్తి పెట్రోల్ పంపు ప్రారంభం



**నల్లగొండ టౌన్ ,ఫ్లాష్ ఇండియా :** మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించే దిశగా నీలగిరి మహిళా సమాఖ్య మరో ముందడుగు వేసింది. నల్లగొండ-సాగర్ రోడ్డులో మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీలగిరి మహిళా శక్తి పెట్రోల్ పంపును మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు. నీలగిరి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ పెట్రోల్ పంపును నిర్వహించనున్నారు. మహిళలకు ఉపాధి కల్పించడంతోపాటు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, నగరపాలక సంస్థ చైర్మన్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# జెన్ జీ లారా నిలదీయండి...

## ఏనుగులు మింగేటోడు పోయి పీనుగలు మింగేటోడు వచ్చాడు

హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా : రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితా పేరుతో మహా దోపిడీ కొనసాగుతోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. తెలంగాణలో మె-ుత్తం 2 కోట్ల 77 లక్షల ఎకరాలుంటే ఏకంగా 95 లక్షల ఎకరాల భూములను నిషేధిత జాబితాలో పెడతారా అని నిలదీశారు. తెలంగాణలో ఏనుగులు మింగేటోడు పోయి పీనుగలు మింగేటోడు వచ్చాడని దుయ్యబట్టారు. ఇవాళ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడిన ఆయన.. ప్రభుత్వం అమ్మిన భూములను, హెచ్ఎండీఏ వేలం వేసిన భూములను, ప్రజలు కష్టపడి డబ్బులు చెల్లించి కొనుక్కున్న భూములను, పరిశ్రమలకు అమ్మిన భూములను కూడా 22ఏలో పెడతారా? అని మండిపడ్డారు. ఆ జాబితా నుండి మా భూములను తొలగించాలంటూ ఏళ్ల తరబడి చెప్పులరిగేలా రెవెన్యూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా రెండున్నరేళ్లుగా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు.

**బకాయిలే ఇవ్వలేదు అడ్వాన్స్ అంటే నమ్మేదెలా?**

వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఫీజు రీయింబర్స్ మెంట్ డబ్బులు అడ్వాన్స్ గా వేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. పాత ఫీజుల బకాయిలే ఇంకా ఇవ్వలేదు వచ్చే ఏడాది నుండి అడ్వాన్స్ గా జమ చేస్తామంటే నమ్మేదెలా? అని ప్రశ్నించారు. కోర్టు మెట్టికాయలేసినా ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పట్టించుకోని ప్రభుత్వం ఇప్పుడు అడ్వాన్స్ గా జమ చేస్తామంటోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు చిత్తు శుద్ధి ఉంటే ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలన్నీ చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అభయహస్తం తెలంగాణ ప్రజల పాలిటి భస్మాసుర హస్తమైందని విమర్శించారు.

**జెన్ జీలకు పిలుపు:**

21 ఏళ్లకే యువత చట్ట సభలకు వచ్చేలా తీర్మానం చేస్తామంటే కాదనే వారెవరు లేరని బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్‌కు చిత్త శుద్ధి ఉంటే జెన్ జీకి మంత్రి పదవులు, ఎమ్మెల్సీ సీట్లు ఇవ్వాలన్నారు. జెన్ జీ లారా... కాంగ్రెస్ మోసాలను ఎండగట్టండని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నేతల మాటల వెనుక ఉన్న అంతరార్థాన్ని గుర్తించి నిలదీయాలని, అవినీతికి తావులేకుండా పాలన చేస్తున్న బీజేపీకి తెలంగాణలో అవకాశమివ్వాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనకు తేడా ఏమీ లేదన్నారు. కేసీఆర్ 10 ఏళ్లలో 6 లక్షల కోట్ల అప్పు చేస్తే.. రేవంత్ రెడ్డి రెండున్నరేళ్లలో 3 లక్షల కోట్ల అప్పు చేశారని ఆరోపించారు. ఎన్నికల్లో హామీలిచ్చి మోసం చేయడం బీఆర్ఎస్‌కు అలవాటుగా మారితే... 6 గ్యారంటీలు, 420 హామీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా హామీల పేరుతో మోసాలను కంటిన్యూ చేస్తోందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఒక కుటుంబమే దోచుకుంటే... కాంగ్రెస్ పాలనలో ఎమ్మెల్యేలు, మంత్రులు, సీఎంతో పాటు ఢిల్లీ పెద్దలకు కూడా దోచి పెడుతున్నారని ధ్వజమెత్తారు.

**వారికి కూడా ఉచిత బియ్యం ఇస్తున్నారా?:**

తెలంగాణ జనాభా 3.5 కోట్లుంటే 3 కోట్ల 43 లక్షల మందికి ఉచితంగా బియ్యం ఇస్తారా? అని మంత్రి ప్రశ్నించారు. తెలంగాణలో 30 లక్షల మంది ఇన్ కం ట్యాక్స్ ఫైల్ చేస్తున్నారు కదా వారికి కూడా బియ్యం ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. హామీల అమలు విషయంలో కాంగ్రెస్ డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నాయని హామీలిచ్చినప్పుడు డబ్బులు లేవని తెలియవా? అని ప్రశ్నించారు. 50 ఏళ్లు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ నేతలకు ఆ మాత్రం తెలియకుండానే అడ్డగోలు హామీలిస్తారా? అని నిలదీశారు. 12 ఏళ్లలో తెలంగాణకు రూ.13 లక్షల కోట్లు ఖర్చు చేసిన ఘనత మోడీ ప్రభుత్వానిదన్నారు. హైవేలు, ట్రిపుల్ ఆర్ కోసమే రూ.1.74 లక్షల కోట్లు ఖర్చు చేశామన్నారు. బుల్లెట్ ట్రైన్ కారిడార్ కోసం మరో రూ.1.5 లక్షల కోట్లు ఖర్చు చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే మరింత అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు.



# స్మార్ట్ కార్డుల పై రాజకీయం చేస్తే సహించేది లేదు

సూర్యాపేట,ఫ్లాష్ ఇండియా : స్మార్ట్ రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీపై రాజకీయ విమర్శలు చేయడం సరికాదని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. నిరుపేదల కడుపు నింపేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం పై రాజకీయ రాద్ధాంతం చేయొద్దని సూచించారు. సూర్యాపేట జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 3.4 కోట్ల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. రేషన్ వ్యవస్థలో మరింత పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా స్మార్ట్ కార్డులను అందిస్తున్నామని చెపా-ఏరు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని ప్రజలకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సన్నబియ్యం పంపిణీ కోసం ప్రభుత్వం రూ.14.9 వేల కోట్లు వెచ్చిస్తోందని పేర్కొన్నారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. స్మార్ట్ కార్డుల పంపిణీ పై విమర్శలు చేస్తున్న వారిని ఉద్దేశించి మంత్రి ఘాటు వ్యాఖ్యలు చేశారు. "అరకొరగా కార్డులు ఇచ్చినవాళ్లు.. అసలు కార్డులు ఇవ్వని వాళ్లు ఇప్పుడు కామెంట్ చేస్తున్నారు. మా ప్రయత్నాన్ని విమర్శించడం మాని అభినందించండి" అని అన్నారు. పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలను రాజకీయాలకు వేదికగా మార్చడం సరికాదని సూచించారు. రేషన్ దుకాణాల్లో ప్రధాని ఫోటో అంశం పై కూడా మంత్రి స్పందించారు. కేంద్ర ప్రభుత్వాన్ని గౌరవిస్తూ, ప్రోటోకాల్ ప్రకారం రేషన్ దుకాణాల్లో ప్రధాని ఫోటో పెడుతున్నామని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి అందుతున్నది దొడ్డు బియ్యం మాత్రమేనని, రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం కోసం భారీగా నిధులు ఖర్చు చేస్తోందని తెలిపారు. స్మార్ట్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ విషయంలో రాజకీయ రాద్ధాంతాలు మానుకోవాలని మంత్రి కోరారు.

# నాకు చెప్పే బదులు రేవంత్ రెడ్డికి చెప్పు..!

## వచ్చినోళ్లకు.. చేర్చుకున్నోళ్లకు బుద్ధి లేదు..

హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా : టీకాంగ్రెస్‌లో మరోసారి అసంతృప్త స్వరాలు భగ్గుమంటున్నాయి. పార్టీలో పాత నేతలకు ప్రయార్టీ తగ్గి బయటి నేతల ఆధిపత్యం పెరిగిందంటూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. రాజగోపాల్ రెడ్డి హద్దు మీరి మాట్లాడవద్దని ఆయన తన లిమిట్స్ లో ఉండాలంటూ టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ రియాక్ట్ హెచ్చరించారు. అయితే మహేశ్ కుమార్ గౌడ్ చేసిన హెచ్చరికలపై రాజగోపాల్ రెడ్డి అంతే ఘాటుగా స్పందించారు. నేను పార్టీ లైన్ దాటలేదని, వ్యక్తిగతంగా నేను ఎవరినీ విమర్శించలేదని నా మాటలను మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకువెళ్లినా ఇబ్బందేమీ లేదని తేల్చేశారు. చేరికల విషయంలో గతంలో కేసీఆర్ చేసిన తప్పిదాన్ని కాంగ్రెస్ చేసిందని, ఎంఐఎం, సీపీఐ సపోర్టు ఉ ండగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని విరుచుకుపడ్డారు.

**వచ్చినోళ్లకు బుద్ధి లేదు.. తీసుకున్నోళ్లకు బుద్ధి లేదు:**

తాజాగా ఓ న్యూస్ చానల్‌తో మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి పోచారం శ్రీనివాస్ రెడ్డి, దానం నాగేందర్ చేరికలపై ఘాటుగా రియాక్ట్ అయ్యారు. బీఆర్ఎస్ బీ-ఫామ్ పై గెలిచిన ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి తీసుకోవడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చినోళ్లకు, చేర్చుకున్నోళ్లకు బుద్ధిలేదంటూ సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. గతంలో పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పీకర్ స్థానంలో ఉండి కాంగ్రెస్ పార్టీ నాశనం అయ్యేలా వ్యవహరించారని అలాంటి వ్యక్తిని పార్టీలోకి ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ పతనానికి కేసీఆర్ నంబర్ వన్ అయితే నెంబర్ టూ పోచారమేనని అలాంటి వ్యక్తి కాంగ్రెస్ పార్టీలోకి ఎందుకు వచ్చారు? ఆయన్ను ఎవరు రప్పించారని ప్రశ్నించారు. పార్టీలో చేరాక ఇప్పుడు తనకు బాధ అనిపిస్తోందని పోచారం మాట్లాడడం విడ్డూరంగా ఉందని అలాంటప్పుడు ఆయన్ను పార్టీలో ఎవరు ఉండమన్నారు వెళ్లిపోవాలన్నారు.

**ఆయన్ను చూస్తే నాయకుల మీద గౌరవం పోతుంది**

ఇక దానం నాగేందర్ లాంటి వాళ్లను చూస్తే జనాల్లో రాజకీయ నాయకుల మీద ఉండే గౌరవం పోతుందని ఆయన బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేశారన్నారు. మళ్లీ బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని అంటున్నాడు. ఇదేం చిల్లర రాజకీయం అని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలో ఉ ండగా కాంగ్రెస్ పార్టీకి నష్టం చేసిన వారిని పార్టీలోకి చేర్చుకోవద్దన్నారు. పార్టీ బలోపేతం చేర్చుకోవద్దన్నారు. చేరికల విషయంలో కాంగ్రెస్ హైకమాండ్‌కు అన్ని తెలుసన్నారు.

**నాకు చెప్పే బదులు రేవంత్ రెడ్డికి చెప్పాలి:**

మహేశ్ కుమార్ గౌడ్ నాకు చెప్పే బదులు చేరికలపై మనం తప్పు చేస్తున్నామని, మన పార్టీ గౌరవం కాపాడుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెప్పాలన్నారు. ఇప్పటికైనా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఉద్యమకారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అవినీతి రహిత ప్రజాపాలన అందించాలని కోరుకుంటున్నానన్నారు. తన వ్యాఖ్యలు పార్టీకి మేలు చేస్తాయే తప్ప నష్టం చేయవని తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు.

# అసెంబ్లీలో చర్చకు రా..



సంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా : మా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్, బీజేపీలు ప్రశ్నిస్తున్నాయని ఈ రెండు పార్టీలు ఒకే నాణేనికి బొమ్మా బొరు-సులాంటివని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ రెండు పార్టీలు గత పదేళ్లు అధికారంలో ఉండి పేదలకు సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో వరి వేస్తే ఉరే అన్న కేసీఆర్ తన ఫామ్ హౌస్ లో మాత్రం వరివేశాడని.. మేము రైతులకు మేలు చేస్తుంటే ఫామ్ హౌస్ లో పడుకుని విమర్శలు చేస్తున్నారని సంగారెడ్డి గడ్డా నుంచి సవాల్ విసురుతున్న కేసీఆర్.. రైతుల కోసం మేము చేసిన మేలు, మీరు చేసిన అన్యాయంపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని చాలెంజ్ చేశారు. ఇవాళ సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు.

**బీజేపీ నేతలు చదువుకుంటే కనిపిస్తుంది:**

కాంగ్రెస్ వస్తే కరెంట్ కరెంట్ కోతలు ఉ ంటాయని నాటి బీఆర్ఎస్ అబద్ధాలు ప్రచారం చేసిందని కానీ మేమువచ్చాక కరెంట్ కోతలు లేదన్నారు. రైతుభరోసా కింద మా ప్రభుత్వం 32 నెలల్లో 36 వేల కోట్లు రూపాయలు 70 లక్షల రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నివేదికల్లో అతి తక్కువ అప్పుల్లో తెలంగాణ రైతాంగం అని నివేదిక ఇచ్చింది వాస్తవం కాదా బీజేపీ నాయకులు అది చదువుకుంటే కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది కదా అన్నారు.

**ఇది రేషన్ కార్డులు మాత్రమే కాదు:**

రేషన్ కార్డులు కేవలం ప్లాస్టిక్ కార్డు మా-త్రమే కాదని పేదల ఆత్మగౌరవం అని ఎక్కడికి వెళ్లినా మీ ఆకలి తీర్చే కార్డు అని అన్నారు. మీ ఆకలి తీర్చేదే ఈ స్మార్ట్ రేషన్ కార్డు అన్నారు. పేదలతో ఆకలితో ఉ ండకూడదని ఈ దేశంలో రేషన్ షాపులు తీసుకువచ్చిందే కాంగ్రెస్ పార్టీ అన్నారు.

**చేతబడులు చేయిస్తున్న అఘోరరావులతో జాగ్రత్త.. సంగారెడ్డి సభలో రేవంత్ రెడ్డి**

మా ప్రభుత్వంపై మీడియా, సోషల్ మీడియాలో అన్ని రకాల కుట్రలు, కుతంత్రాలు చేశారని అవన్నీ కుదరకపోవడంతో పొరుగు రాష్ట్రాలకు వెళ్లి అఘోర పూజలు చేస్తున్నారని బీఆర్ఎస్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరోక్షంగా విమర్శలు గుప్పించారు. హరీశ్ రావు పేరు ప్రస్తావించకుండా.. పదేళ్లు మంత్రిగా చేసిన వ్యక్తి రాష్ట్ర ప్రజలు నాశనం కావాలని పొరుగు రాష్ట్రాల్లో అఘోర పూజలు చేయించాడని, అన్నం తినేవాడు ఎవడైనా ఈ రాష్ట్రంలో కరువు రావాలని, ప్రభుత్వం కూలిపోయి రాష్ట్రం అల్లకల్లోలం కావాలని చేతబడులు చేయిస్తారా అని ప్రశ్నించారు. సంగారెడ్డి సభలో ప్రసంగించిన రేవంత్ రెడ్డి.. నా మీద, మా నాయకులు మీద చేతబడులు చేస్తే ఎదుర్కొంటారం కానీ ప్రజల మీద ఎవరైనా చేస్తారా? శవాల మీద అధికారంలోకి రావాలనుకుంటున్నారని అందులో భాగంగానే ఇవ్వన్నీ చేయిస్తున్నారని ఆరోపించారు.

**అగ్గిపెట్టేరావు.. అఘోరరావు..**

అడుగు తీసి అడిగి బయటపెడితే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే మీరు పొరుగు రాష్ట్రాల్లో దేవాలయాలకు వెళ్తే ఎందుకు పోస్టులు పెట్టలేదని పైగా మహేశ్ కుమార్ గౌడ్‌కు నోటీసులు ఇస్తున్నారని మండిపడ్డారు. శివమొగ్గ గుడికి వెళ్లింది చెప్పకుండా దాస్తూ ఎందుకు పిల్లిమొగ్గలు వేస్తున్నారని మండిపడ్డారు. మా ఆలోచనలు, సంకల్పం గొప్పవి కాబట్టే మాకు ప్రకృతి, దేవుడు సహకరిస్తున్నాడన్నారు. రాష్ట్రంలోని య-ువతను మభ్యపెట్టేందుకు అగ్గిపెట్టేరావు, అఘోరరావులు వస్తారని అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని యువకులకు సూచించారు. వీళ్లకు అగ్గిపెట్టెలు దొరకవు కానీ అమాయక యువతను బలి చేస్తారన్నారు.

**త్వరలోనే ఉద్యోగ ఖాళీలు భర్తీ:**

ఐదేళ్లు మహిళలకు మంత్రి పదవి ఇవ్వని వారు, ఇవాళ మహిళలపై మాట్లాడుతున్నారని, కేసీఆర్ ఇంట్లో అందరికీ ఉద్యోగాలొచ్చాయి, నిరుద్యోగులకు ఉద్యోగం రాలేదన్నారు. త్వరలోనే ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తామన్నారు. ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేసేందుకు చిత్తశుద్ధితో ఉన్నామన్నారు. మాటిస్తే మట్టిలో కలిసే వరకు నిలబడి ఉ ంటానన్నారు. దుర్మార్గులు , దుష్టులు మా-యమాటలతో వస్తారు, యువత నమ్మొద్దు అన్నారు. సంక్షోభంలో నుంచి బయటపడేసి సంక్షేమంవైపు నడిపిస్తున్నామన్నారు. ఒకపూట ఆలస్యమైన సంక్షేమం ఆగదు, మీ హక్కులు ఆపబోమన్నారు.

**రూ.100 కోట్లిచ్చినా జగ్గారెడ్డి వంటి నేత దొరకడు : సీఎం రేవంత్ రెడ్డి**

సంగారెడ్డి వేదికగా జరిగిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జగ్గారెడ్డి లాంటి నిబద్ధత గల నాయకుడిని కాపాడుకోవాల్సిన బాధ్యత పూర్తిగా సంగారెడ్డి ప్రజలపైనే ఉందని ఆయన స్పష్టం చేశారు. రూ.100 కోట్లు ఖర్చు చేసినా జగ్గారెడ్డి వంటి నాయకుడు దొరకరని ఈ సందర్భంగా సీఎం కొనియాడారు. పొరుగున ఉన్న కర్ణాటకలో బోసురాజుకు ముందుగా మంత్రి పదవి ఇచ్చి, ఆ తర్వాత ఎమ్మెల్సీని చేసిన విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణలో కూడా జగ్గారెడ్డి విషయంలో ఏదైనా జరగవచ్చని సంచలన వ్యాఖ్యలు చేశారు. గత శాసనసభ ఎన్నికల్లో జగ్గారెడ్డి గెలిచి ఉంటే ఈపాటికి ఆయన ప్రభుత్వం లేదా పార్టీలో అత్యంత కీలకమైన పదవిలో ఉండేవారని వ్యాఖ్యానించారు. సంగారెడ్డి నుంచి జగ్గారెడ్డి పోటీ చేయాలా వద్దా అనేది కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ నిర్ణయిస్తారని సీఎం తెలిపారు. పోటీలో నిలబడడం అనేది జగ్గారెడ్డి చేతిలో గానీ, తన చేతిలో గానీ లేదని పేర్కొన్నారు. ఒకవేళ నిర్మలకు సంగారెడ్డి స్థానం కేటాయిస్తే, జగ్గారెడ్డికి వేరే చోట అవకాశం ఇచ్చే ఆలోచన ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. తాను పలుమార్లు హైదరాబాద్‌కు రావాలని కోరినప్పటికీ, జగ్గారెడ్డి మాత్రం తనను నమ్ముకున్న సంగారెడ్డి ప్రజలను వదిలి రానని ఇక్కడే ఉ ంటానని చెప్పారని సీఎం గుర్తుచేసుకున్నారు. సంగారెడ్డి ప్రజల పట్ల జగ్గారెడ్డికి ఉన్న అంకితభావానికి ఇది నిదర్శనమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# స్వాతంత్ర్య వేడుకలు.. అదిరిపోయే స్టెప్పులేసిన వీహెచ్



కామారెడ్డి,ఫ్లాష్ ఇండియా : కామారెడ్డి పట్టణంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో ఘనంగా జరిగిన 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు (వీహెచ్) సందడి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. గిరిజన పాటలకు నృత్యాలు చేస్తున్న విద్యార్థులను చూసి మురిసిపోయారు. ఉత్సాహం ఆపుకోలేక నేరుగా స్టేజ్ పైకి వెళ్లి వారితో కలిసి డ్యాన్స్ చేశారు. ఆయనతో పాటు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కూడా విద్యార్థులతో కలిసి స్టెప్పులేసి సందడి చేశారు. వీరు వేసిన డ్యాన్స్ ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందుకు సంబంధించిన వీడియో తాజాగా నెట్టింట వైరల్‌గా మారింది.

# కలెక్టరేట్ ప్రాంగణంలో ఘనంగా 80వ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





మేడ్చల్(కలెక్టరేట్ ),ఫ్లాష్ ఇండియా ప్రతినిధి : మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టరేట్ లో 80వ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పబ్లిక్ అఫైర్స్) డాక్టర్.కె. కేశవరావు పాల్గొని జాతీయ జెండా ను ఎగురవేసి పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ వేడుకలలో జిల్లా కలెక్టర్ యం. మను చౌదరి, ఉప్పల్ డిసిపి సురేష్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు వారి జీవితాలను పణంగా పెట్టారని, వారి కుటుంబాలకు కృతజ్ఞతలతో జోహార్లు అర్పించారు. ఆ త్యాగఫలంతో స్వాతంత్ర్యం సిద్దించుకున్నామన్నారు, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వము చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు తీరును ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రం రాష్ట్రాభివృద్ధికి ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలతో తెలంగాణ నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించే దిశలో కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజా పాలనను రూపకల్పన చేసి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులై న ప్రతి ఒక్కరికి అందించి, పేదలను ఆర్థికంగా అభివృద్ధి పర్చుటకు నిరంతరం శ్రమిస్తుందని అన్నారు. ఇందులో భాగంగా గృహజ్యోతి, రేషన్ కార్డుల పంపిణీ తో పాటు లబ్దిదారులకు సన్న బియ్యం అందిస్తుందని, అలాగే విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుందని, బస్తీ దవఖానాలు ఏర్పాటు చేసి నిరంతరం వైద్య సేవలను అందింస్తుంది. అలాగే రాష్ట్రంలోని వసతి గృహాలలో అన్ని మౌళిక వసతుల కల్పనతో పాటు బుక్స్, యూనిఫామ్స్ అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును సందేశం ద్వారా వివరించారు. (సందేశం ప్రతిని ఇందు వెంట జతపర్చనైనది) ఈ వేడుకలలో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధులు జానాభాయ్, రాజారెడ్డిలను ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె. కేశరరావు, జిల్లా కలెక్టర్ మను చౌదరి, డిసిపి, అదనపు కలెక్టర్లు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు.

**సాంస్కృతిక కార్యక్రమాలు:**

విద్యాశాఖ ఆధ్వర్యంలో కీసర ఎంజిపిటిబిసి, శామీర్ పేట్ జెడ్ పిహెచ్ఎస్, ఉప్పల్ టిజిఎంఆర్, మేడిపల్లి జెడ్ పిహెచ్ఎస్, గిరిజన హాస్టల్, కుత్బుల్లాపూర్ ఎస్సీ వెల్ఫేర్ వారు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకర్షించాయి. ఉ త్తమ నృత్యప్రదర్శనలు ఇచ్చినందున వారికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మెమెంటోలను అందించి, చిన్నారుల ను అభినందించారు.

**ప్రశంసా పత్రాల పంపిణీ:**

ఈ సందర్భంగా జిల్లాలోని ఉద్యోగ ధర్మంలో ఉత్తమ సేవలు అందించిన జిల్లా అధికారులకు ఉద్యోగులకు డిసిపి సురేష్ కుమార్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి లతో కలసి జిల్లా కలెక్టర్ మన చౌదరి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, , డిఇఓ రేణుక, కలెక్టరేట్ పరిపాలన అధికారి సీతారాం, ఇంచార్జ్ డిఆర్డిఓ పిడి కాంతమ్మ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, విద్యార్థులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం




# వికసిత భారతమే మన గమ్యం

అనేక వైరుధ్యాలకు నెలవైన భారతదేశం ఎక్కువ కాలం మనుగడ సాగించదన్న వాదనలను పటాపంచలు చేస్తూ, భిన్నత్వంలో ఏకత్వానికి ఆదర్శంగా నిలిచాం. ఆకలి కేకల నుంచి ఆహార భద్రత వైపు పయనించాం. అప్పుల కోసం ఆరాటపడే దేశం నుంచి ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదిగాం. వెనుకబడిన దేశం నుంచి ప్రపంచ వేదికపై ప్రభావం చూపుతున్న దేశంగా రూపాంతరం చెందాం. ఈ ప్రగతి ప్రస్థానంలో ఎన్నో చిరస్మరణీయ విజయాలు భారత కీర్తి కిరీటంలో చేరాయి. ఈ నిర్మాణాత్మక ప్రస్థానాన్ని గర్వంగా చాటుకోవాల్సిన వేళ.. విధ్వంస రాజకీయాల ఛాయలు ఆందోళన కలిగిస్తున్నాయి. అధికార యావలో పడి కొన్ని రాజకీయ పార్టీలు, వాటికి వంత పాడే శక్తులు దేశ నిర్మాణం కంటే విధ్వంసానికే ప్రాధాన్యమివ్వడం ఆవేదన కలిగిస్తోంది. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ప్రాధాన్యతను విస్మరించలేం. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను ప్రశ్నించడం, తప్పులను ఎత్తిచూపడం, ప్రజా సమస్యలపై పోరాడటం ప్రతిపక్షం బాధ్యత. పార్లమెంటులో చర్చకు పట్టుబట్టడం, ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలబెట్టడం ప్రతిపక్షానికి ఉన్న ప్రజాస్వామ్య హక్కు. ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ తన ఈ బాధ్యతలను, హక్కులను గుర్తించడం లేదు. పార్లమెంటు పనితీరును అడ్డుకోవడమే అజెండాగా పనిచేస్తోంది. నిర్మాణాత్మక చర్చలకు ఆస్కారం కల్పించకుండా నిరసనలకు, ఆందోళనలకు పార్లమెంటును వేదికగా మార్చుతోంది. ఇటీవలి పరిణామాలను గమనిస్తే కాంగ్రెస్ రాజకీయ వ్యూహంలో ఒక రకమైన 'విఘాతం కలిగించే మనస్తత్వం' కనిపిస్తోంది. పార్లమెంటులో ఏదైనా అంశంపై చర్చ జరగాలని ప్రతిపక్షం పట్టుబట్టడం ప్రజాస్వామ్యంలో సహజం. కానీ ప్రభుత్వం చర్చకు సిద్ధమని చెబుతున్నా నిరసనలు కొనసాగిస్తే ఏమనుకోవాలి? ప్రభుత్వం సమాధానం చెప్పాలంటే సభ నడవాలి కదా! నినాదాలు, నిరసనలు, వాకౌట్లతో సభ సజావుగా నడవకుండా అంతరాయం కలిగిస్తే ప్రభుత్వం ఎలా చర్చను కొనసాగిస్తుంది? ప్రతిపక్షం వాదన ప్రజలకు తెలియాలన్నా పార్లమెంటు నడవాలి కదా! కాంగ్రెస్, ఇండీ కూటమి పార్లమెంటుకు అంతరాయం కలిగించడమే లక్ష్యంగా, సభను అడ్డుకోవడమే ధ్యేయంగా పెట్టుకుంటున్నాయి. ఇది ముమ్మాటికి రాజ్యాంగకర్తలను అవమానించడమే. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనూ విద్యార్థుల ఆందోళనకు సంబంధించిన అంశంపై చర్చ జరపాలని తొలుత కాంగ్రెస్ పట్టుబట్టింది, చర్చకు సిద్ధమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ వెంటనే స్వరం మార్చి, జంతర్ మంతర్ ఆందోళనకారులపై జరిగిన లాఠీచార్జీకి ప్రధానమంత్రి క్షమాపణలు చెప్పాలంటూ కొత్త పల్లవి అందుకుంది. యూపీఏ-2 హయాంలో అధికార పక్షమైన కాంగ్రెస్ నాటి విపక్షం గొంతు ఎలా నొక్కిందో తెలియడానికి 2010 శీతాకాల సమావేశాలను గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. రూ.1.76 లక్షల కోట్ల కుంభకోణమైన 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపుల్లో అవినీతిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో దర్యాప్తు జరపాలని బీజేపీ డిమాండ్ చేస్తే, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. చివరకు సుప్రీంకోర్టు భారీ స్థాయిలో అవినీతి జరిగిందంటూ ఆ కేటాయింపులను రద్దు చేసి, పారదర్శకంగా మళ్లీ వేలం వేయాలని ఆదేశించిందంటే బీజేపీ డిమాండ్ ఎంత సహేతుకమో అర్థమవుతుంది. ఆ సెషన్‌లో లోక్‌సభలో మొత్తం సమయంలో 6శాతం, రాజ్యసభలో 2శాతం మాత్రమే సద్వినియోగం అయ్యింది. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షం డిమాండ్లను పట్టించుకోని కాంగ్రెస్.. ఇప్పుడు మాత్రం పార్లమెంటరీ సంప్రదాయాలు, చర్చలు అంటూ గురివింద నీతులు వల్లిస్తోంది. పార్లమెంటులోనే కాదు, బయటా కాంగ్రెస్ ధోరణి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. ఇటీవలి జంతర్ మంతర్ నీట్ ఆందోళనల సమయంలోనూ కాంగ్రెస్ "విఘాతం కలిగించే మనస్తత్వం" స్పష్టంగా బయటపడింది. నీట్ పరీక్ష లీకేజీపై విద్యార్థుల ఆవేదన అర్థం చేసుకోదగినదే! వారి ఆందోళనను తప్పుబట్టలేం. కానీ, విద్యార్థుల ముసుగులో కొన్ని సంఘ వ్యతిరేక శక్తులు, విచ్ఛిన్నకర శక్తులు ఆ ఆందోళనల్లో ప్రవేశించాయి. కాంగ్రెస్ ఆ అరాచక శక్తులను ఉసిగొల్పిందనడం సబబుగా ఉంటుందేమో. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలన్న ఉద్దేశంతో ప్రజల మధ్య విద్వేషాలు తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ చేసిన ప్రయత్నం దేశ సమగ్రతకే ప్రమాదం. ఇలాంటి చర్యలను ఈసడించుకుంటూ జంతర్ మంతర్ నిరసనల్లో పాల్గొన్న కొందరు విద్యార్థులు సైతం ఆందోళన వీడారు. ఇవి తమ నిరసన వెనక ఉన్న అసలైన ఉద్దేశాన్ని తప్పుదోవ పట్టిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం మాత్రం విద్యార్థుల ఆందోళనలను అర్థం చేసుకొని సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించింది. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 1949 నవంబర్ 25న రాజ్యాంగ సభలో చేసిన ప్రసంగాన్ని గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజ్యాంగం ద్వారా ప్రజాస్వామ్య మార్గాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత శాసనోల్లంఘన, సహాయ నిరాకరణ, సత్యాగ్రహం వంటి రాజ్యాంగేతర పద్ధతులను ఆశ్రయించడం అరాచకానికి దారి తీస్తుందంటూ 'గ్రామర్ ఆఫ్ అనార్కీ''గా అభివర్ణించారు. నిరసన తెలపడాన్ని ఎవరూ తప్పుబట్టరు. కానీ, ఆ నిరసన రాజ్యాంగబద్ధంగా ఉండాలి, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసేలా ఉండాలి. కాంగ్రెస్ తీరు అందుకు విరుద్ధంగా ఉండడమే ఇక్కడ ఆందోళనకరం. అంతేకాక సుప్రీంకోర్టు, కేంద్ర ఎన్నికల కమిషన్, పార్లమెంటు, ప్రధానమంత్రి కార్యాలయం తదితర వ్యవస్థల విశ్వసనీయతపైనే సందేహాలు తలెత్తేలా వ్యవహరిస్తోంది. కాంగ్రెస్‌లో గూడుకట్టుకున్న నిరాశ నిస్పృహలకు వారు ఉపయోగిస్తున్న భాష కూడా ఉదాహరణ. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పట్ల, ఆయన మాతృమూర్తి పట్ల కాంగ్రెస్ నాయకుల అభ్యంతరకర అసభ్య పద ప్రయోగం వారి పతనానికి పరాకాష్ఠ. వ్యక్తిగత అవమానానికి, నిర్మాణాత్మక విమర్శకు మధ్య తేడా ఉంటుంది. ప్రజలు కేవలం ప్రభుత్వ పనితీరునే కాదు.. ప్రతిపక్షం వ్యవహారశైలినీ గమనిస్తారు. 2014 నుంచి భారతదేశం అభివృద్ధి దిశగా వేగంగా పరిగెడుతోంది. సంక్షేమంలో సరికొత్త ప్రమాణాలు సృష్టిస్తోంది. ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించింది. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది. అంతరిక్షంలో త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడిస్తోంది. అంతర్జాతీయ దౌత్యంలో కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రపంచమంతటా భారత ప్రతిష్ఠ పెరిగింది. ఇటువంటి తరుణంలో దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు అయ్యే నాటికి, అంటే 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలన్న సంకల్పంతో నిర్విరామంగా కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మద్దతుగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా.. రాజకీయ ప్రయోజనాల కంటే ముందుగా దేశ ప్రయోజనాన్ని, రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య సంస్థల గౌరవాన్ని నిలబెట్టాలి. బ్రిటిష్ వలస పాలన నుంచి భారతావని విముక్తి కోసం పోరాడిన సమరయోధుల స్ఫూర్తితో వికసిత భారత నిర్మాణానికి సమస్త భారతీయులం సమైక్యంగా పునరంకితం అవుదాం!

# ప్రజా ప్రయోజనమా.. పర్యావరణ ప్రయోజనమా?

ప్రజాప్రయోజన చట్టాలకు మన న్యాయవ్యవస్థలో ప్రత్యేక స్థానం ఉంది. సామాజిక న్యాయం, ప్రజల హక్కులు, పర్యావరణ పరిరక్షణ వంటి విస్తృత లక్ష్యాలను సాధించేందుకు రూపొందించిన చట్టాలను కోర్టులు సాధారణంగా ఉదారంగా నిర్వచిస్తాయి. అయితే ఆ ఉదారతకు ఒక హద్దు ఉంటుంది. చట్టం ఎవరి ప్రయోజనం కోసం రూపొందించబడిందో వారి ప్రయోజనాలను కాపాడాలి కానీ, అదే చట్టం ఉద్దేశాన్ని బలహీనపరిచే స్థాయికి వెళ్లకూడదు. ఇటీవల వనశక్తి కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన పరిణామాలు ఈ ప్రశ్నను మరోసారి ముందుకు తెచ్చాయి. పర్యావరణ పరిరక్షణ చట్టం, 1986 కింద రూపొందిన పర్యావరణ ప్రభావ అంచనా నిబంధనల అసలు ఉద్దేశం ఏమిటి? అభివృద్ధి పనులు ప్రారంభించకముందే వాటి వల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని అంచనా వేసి, అవసరమైన అనుమతులు పొందేలా చేయడం. 1994 నాటి నిబంధనల నుంచి 2006 నాటి పర్యావరణ ప్రభావ అంచనా నోటిఫికేషన్ వరకు ఈ సూత్రం మరింత స్పష్టమైంది. ముందస్తు పర్యావరణ అనుమతి లేకుండా ప్రాజెక్టును ప్రారంభించకూడదు అన్నది ఈ వ్యవస్థకు మూల సూత్రం. కానీ ఆచరణలో పరిస్థితి భిన్నంగా మారింది. కొన్ని పరిశ్రమలు, భారీ ప్రాజెక్టులు పర్యావరణ అనుమతులు పొందకుండానే నిర్మాణాలను ప్రారంభించాయి. మరికొన్ని నిర్మాణాలను పూర్తిచేసి ఉత్పత్తి కూడా ప్రారంభించాయి. ఇలాంటి ఉల్లంఘనలకు తరువాత అనుమతులు ఇచ్చే విధానమే 'ఎక్స్‌పోస్ట్ ఫ్యాక్టో' పర్యావరణ అనుమతిగా మారింది. ఇక్కడే అసలు సమస్య ఉంది. పర్యావరణ అనుమతి అంటే కేవలం ఒక పరిపాలనా లాంఛనం కాదు. ఒక ప్రాజెక్టు ప్రారంభానికి ముందు దాని వల్ల కలిగే పర్యావరణ ప్రభావాలను పరిశీలించడం, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం, ప్రమాదాలను అంచనా వేయడం దాని ఉద్దేశం. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన తర్వాత లేదా పరిశ్రమ కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత అనుమతి ఇవ్వడం ద్వారా ఆ ముందస్తు పరిశీలన యొక్క అసలు ప్రయోజనం దెబ్బతింటుంది. ముఖ్యంగా పర్యావరణ నష్టానికి ఒక ప్రత్యేక స్వభావం ఉంది. ఒకసారి అడవులు నశిస్తే, నదులు కలుషితమైతే, భూగర్భ జలాలు దెబ్బతింటే, జీవ వైవిధ్యం నష్టపోతే వాటిని పాత స్థితికి తీసుకురావడం చాలా సందర్భాల్లో అసాధ్యం. అందుకే పర్యావరణ చట్టంలో 'ముందస్తు జాగ్రత్త' అన్నది అత్యంత కీలకమైన సూత్రం. ఇప్పటికే పర్యావరణ అనుమతి లేకుండా చేపట్టిన ప్రాజెక్టులకు వివిధ సందర్భాల్లో సడలింపులు ఇవ్వడానికి ప్రయత్నాలు జరిగాయి. 2017లో కేంద్ర పర్యావరణ శాఖ ఇచ్చిన ఉత్తర్వు, అనంతరం 2021లో వచ్చిన ఆఫీస్ మెమోరాండం ఈ చర్చకు కేంద్రబిందువులయ్యాయి. వీటిపై న్యాయపరమైన సవాళ్లు రావడం సహజమే. ఎందుకంటే ఒకసారి ఉల్లంఘన జరిగిపోయిన తర్వాత దానికి చట్టబద్ధత కల్పించే మార్గం తెరవబడితే, ముందస్తు అనుమతి వ్యవస్థే అర్థరహితంగా మారే ప్రమాదం ఉంటుంది. వనశక్తి కేసులో 2025 మేలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఈ విషయంలో స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. పర్యావరణ పరిరక్షణ చట్టం పేరుతోనే ఆ చట్టం ఉద్దేశాన్ని బలహీనపరిచే సడలింపులు ఇవ్వలేమని కోర్టు పేర్కొంది. ముందస్తు అనుమతి అవసరాన్ని పక్కనపెట్టి, ఉల్లంఘన జరిగిన తర్వాత అనుమతులు ఇచ్చే విధానం పర్యావరణ పరిరక్షణ సూత్రానికి విరుద్ధమని స్పష్టం చేసింది. అయితే అనంతరం వచ్చిన పునర్విచారణ తీర్పులో మరో కోణం తెరపైకి వచ్చింది. ఎక్స్‌పోస్ట్ ఫ్యాక్టో అనుమతులకు సాధారణ చట్టబద్ధత లేదనే అంశాన్ని కొనసాగిస్తూనే, కొన్ని పరిస్థితుల్లో 'ప్రజాప్రయోజనం' ఆధారంగా ముందస్తు అనుమతి నిబంధనలో సడలింపుకు అవకాశం ఉన్నట్టుగా వ్యాఖ్యానించడం చర్చకు దారితీసింది. ఇక్కడే అసలు న్యాయపరమైన, సామాజిక ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ప్రజాప్రయోజనం అంటే ఏమిటి? ప్రజలకు విద్యుత్ అవసరం ఉంది. పరిశ్రమలు అవసరం. ఉపాధి అవసరం. మౌలిక వసతుల అభివృద్ధి కూడా అవసరం. కానీ అదే ప్రజలకు స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, సురక్షితమైన జీవన వాతావరణం కూడా అవసరం. కాబట్టి ప్రజాప్రయోజనాన్ని కేవలం పెట్టుబడి, ఉపాధి, ఆర్థిక కార్యకలాపాల కోణంలో మాత్రమే చూడలేం. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని పణంగా పెట్టడం కూడా చివరికి ప్రజాప్రయోజనానికే వ్యతిరేకంగా మారుతుంది. ఒక పరిశ్రమ వల్ల తక్షణం ఉద్యోగాలు రావచ్చు. కానీ అదే పరిశ్రమ వల్ల ఒక ప్రాంతంలోని నీటి వనరులు కలుషితమైతే, రైతుల జీవనోపాధి దెబ్బతింటే, ప్రజల ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం పడితే ఆ అభివృద్ధి నిజంగా ప్రజాప్రయోజనమేనా అన్నది ప్రశ్నించాల్సిందే. అందుకే పర్యావరణ చట్టాల్లో 'ముందస్తు జాగ్రత్త సూత్రం'కు అంత ప్రాధాన్యం. ముఖ్యంగా వాతావరణ మార్పు ప్రభావాలు తీవ్రంగా కనిపిస్తున్న ప్రస్తుత కాలంలో ఈ జాగ్రత్త మరింత అవసరం. అభివృద్ధి అవసరమే అయినా, పర్యావరణ పరిరక్షణకు మూల్యం చెల్లించి సాధించే అభివృద్ధి సుస్థిర అభివృద్ధి కాదు. భారత పర్యావరణ న్యాయశాస్త్రం అభివృద్ధిలో సుప్రీంకోర్టు పాత్ర చారిత్రాత్మకమైనది. 1990లలో వచ్చిన అనేక తీర్పుల ద్వారా పర్యావరణ హక్కులను జీవించే హక్కుతో అనుసంధానిస్తూ, కాలుష్య రహిత వాతావరణాన్ని పౌరుల మౌలిక హక్కుల పరిధిలోకి తీసుకురావడంలో కోర్టు కీలక పాత్ర పోషించింది. 'కాలుష్యం చేసేవాడే చెల్లించాలి', 'ముందస్తు జాగ్రత్త' వంటి సూత్రాలకు న్యాయపరమైన బలాన్ని ఇచ్చింది. అందుకే నేటి పరిణామాలను కూడా అదే విస్తృత ప్రజాప్రయోజన దృక్పథంతో చూడాల్సిన అవసరం ఉంది. కోర్టు తీర్పుల ఉద్దేశం పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని మరింత బలపరచడమే కావాలి. చట్టంలో లేని మినహాయింపులకు న్యాయపరమైన మార్గం తెరవడం ద్వారా భవిష్యత్తులో ఉల్లంఘనలకు ప్రోత్సాహం కలగకుండా జాగ్రత్త పడాలి. లేకపోతే ఒక ప్రమాదకరమైన సందేశం వెళ్లే అవకాశం ఉంది ముందుగా అనుమతి తీసుకుని చట్టాన్ని పాటించాల్సిన అవసరం లేదు; ముందుగా ప్రాజెక్టు ప్రారంభించి, తరువాత ఏదో ఒక ప్రజాప్రయోజనం చూపించి పరిష్కారం పొందవచ్చన్న భావన. అలాంటి పరిస్థితి ఏర్పడితే పర్యావరణ అనుమతి వ్యవస్థ క్రమంగా కాగితపు ప్రక్రియగా మారిపోతుంది. ప్రజాప్రయోజనం పేరుతో చట్టాన్ని ఉదారంగా అర్థం చేసుకోవడం ఒక విషయం. అదే పేరుతో చట్టం నిర్దేశించిన ప్రాథమిక రక్షణను సడలించడం మరో విషయం. ఈ రెండింటి మధ్య ఉన్న సన్నని గీతను న్యాయవ్యవస్థ అత్యంత జాగ్రత్తగా కాపాడాలి. పర్యావరణం ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదు. అది భవిష్యత్ తరాలకు చెందిన సామూహిక సంపద. అందువల్ల పర్యావరణ చట్టాల్లో సడలింపుల ప్రశ్న వచ్చిన ప్రతిసారీ తక్షణ ఆర్థిక ప్రయోజనాల కంటే దీర్ఘకాలిక ప్రజాప్రయోజనాన్ని ముందుకు పెట్టాలి. అభివృద్ధి కావాలి. పరిశ్రమలు రావాలి. పెట్టుబడులు రావాలి. కానీ చట్టాన్ని ఉల్లంఘించిన తర్వాత అనుమతి పొందే సంస్కృతి మాత్రం రావద్దు. ముందస్తు పర్యావరణ అనుమతి అనే రక్షణ కవచం బలహీనపడితే నష్టం ప్రకృతికే కాదు-ప్రజల భవిష్యత్తుకూ.

# గూర్ఖాల గర్జన..



నేపాల్‌లో మరోసారి గూర్ఖాల గర్జన వినిపిస్తోంది. ఇప్పటికే జెన్-జీ ఉద్యమాలతో రాజకీయ అస్థిరతను ఎదుర్కొంటున్న నేపాల్‌లో ఇప్పుడు మాజీ గూర్ఖా సైనికులు, యువత పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగడం ఆసక్తికర పరిణామం. భారత సైన్యంలో నేపాలీ యువతకు మళ్లీ అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేయడం వెనుక కేవలం సైనిక సేవపై ఉన్న మక్కువ మాత్రమే కాదు.. ఉపాధి కోసం వారు ఎదుర్కొంటున్న తీవ్రమైన సంక్షోభం కూడా ఉంది. భారత ఆర్మీ ఉన్నతాధికారుల నేపాల్ పర్యటన సమయంలో ఈ డిమాండ్లు మరింత బలంగా వినిపించడం ఇరు దేశాల మధ్య ఉన్న చారిత్రక, సామాజిక, సైనిక సంబంధాలను మరోసారి గుర్తుచేస్తోంది. గూర్ఖా సైనికుల సేవ భారత సైనిక చరిత్రలో ప్రత్యేక అధ్యాయం. 1814-16 ఆంగ్లో-నేపాల్ యుద్ధం అనంతరం గూర్ఖాల సాహసాన్ని గుర్తించిన ఈస్ట్ ఇండియా కంపెనీ 1815లో తొలి గూర్ఖా బెటాలియన్‌ను ఏర్పాటు చేసింది. ఆ సంప్రదాయం స్వాతంత్ర్యం తర్వాత కూడా కొనసాగింది. 1947లో భారత్, బ్రిటన్, నేపాల్ మధ్య కుదిరిన త్రైపాక్షిక ఒప్పందం గూర్ఖాల సైనిక సేవకు ఒక అధికారిక పునాది వేసింది. ఆ తర్వాత భారత సైన్యంలో వేలాది మంది నేపాలీ యువకులు సేవలందించారు. ప్రస్తుతం కూడా సుమారు 35 వేల మంది నేపాలీ సైనికులు భారత సైన్యంలో పనిచేస్తుండగా, 1.32 లక్షల మంది పింఛన్‌దారులు ఉన్నారని పేర్కొంటున్నారు. వారి జీతాలు, పింఛన్ల రూపంలో నేపాల్ ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన ఆదాయం చేరుతోంది. అయితే గత కొన్నేళ్లుగా గూర్ఖా నియామకాలు నిలిచిపోయాయి. కోవిడ్ సమయంలో ఏర్పడిన అంతరాయం ఒక కారణమైతే, 2022లో భారత్ ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకం మరో కీలక కారణంగా మారింది. అగ్నిపథ్ విధానం 1947 నాటి త్రైపాక్షిక ఒప్పందంతో సరిపోలదనే అభిప్రాయంతో నేపాల్ ప్రభుత్వం కొత్త నియామకాలను నిలిపివేసింది. ఇప్పుడు పరిస్థితి మారుతున్నట్టు కనిపిస్తోంది. నేపాల్‌లో స్థానిక ఉపాధి అవకాశాలు పరిమితంగా ఉండటం, విదేశాలకు వెళ్లే యువతకు కొత్త సవాళ్లు ఎదురవడం, ముఖ్యంగా గల్ఫ్ ప్రాంతంలో నెలకొంటున్న ఉద్రిక్త పరిస్థితులు యువత ఆలోచనలను ప్రభావితం చేస్తున్నాయి. ఒకప్పుడు గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాలను ఆశ్రయించిన నేపాలీ యువతలో కొందరు ఇప్పుడు భారత సైన్యాన్ని మరింత సురక్షితమైన, గౌరవప్రదమైన ఉపాధి మార్గంగా చూస్తున్నారు. అగ్నివీరులుగా అయినా భారత సైన్యంలో చేరేందుకు సిద్ధమని వారు చెబుతుండటం దీనికి నిదర్శనం. ఇక్కడ గమనించాల్సిన మరో అంశం నేపాల్ ఆర్థిక వ్యవస్థపై పడుతున్న ప్రభావం. భారత సైన్యంలో నియామకాలు నిలిచిపోవడంతో జీతాలు, పింఛన్ల రూపంలో నేపాల్‌కు వచ్చే ఆదాయంపై ప్రభావం పడుతోంది. ఉపాధి, కుటుంబ ఆదాయం, స్థానిక ఆర్థిక వ్యవస్థలతో ముడిపడి ఉన్న ఈ సంబంధాన్ని కేవలం సైనిక నియామకాల సమస్యగా చూడటం సరికాదు. అయితే అగ్నిపథ్ విషయంలో భారత్-నేపాల్ మధ్య ఉన్న విభేదాలకు శాశ్వత పరిష్కారం అవసరం. ఒకవైపు భారతదేశం తన సైనిక నియామక విధానాన్ని సమర్థించుకునే హక్కు కలిగి ఉంది. మరోవైపు నేపాల్ తన పౌరుల ఉపాధి, భద్రత, భవిష్యత్తు గురించి ఆలోచించడం సహజం. అందువల్ల ఇరు దేశాలు పరస్పర విశ్వాసంతో చర్చలు జరపడం అత్యవసరం. గూర్ఖా సైనిక సంబంధం రెండు దేశాల మధ్య కేవలం ఉద్యోగ సంబంధం కాదు. ఇది శతాబ్దాల చరిత్ర, సాంస్కృతిక అనుబంధం, పరస్పర విశ్వాసంతో ముడిపడిన బంధం. అందుకే ప్రస్తుత సమస్యకు రాజకీయ పంతాలు, భావోద్వేగ నినాదాల కంటే దౌత్యపరమైన పరిష్కారం అవసరం. నేపాల్ యువతకు ఉపాధి కావాలి. భారత సైన్యానికి నిబద్ధత కలిగిన సైనికులు కావాలి. ఇరు దేశాలకూ పరస్పర విశ్వాసం అవసరం. ఈ మూడు అంశాలను సమన్వయం చేయగల పరిష్కారమే భవిష్యత్తులో గూర్ఖా సంప్రదాయాన్ని కొనసాగించగలదు. గూర్ఖాల శౌర్యం చరిత్రలో నిలిచిపోయింది; ఇప్పుడు వారి భవిష్యత్తుకు భద్రమైన మార్గం చూపాల్సిన బాధ్యత భారత్, నేపాల్ ప్రభుత్వాలపై ఉంది.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# రైతు బీమా బంద్!

## నవంబరు 19 నుంచి ఇందిరమ్మ బీమా..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో రైతు బీమా పథకం నిలిచిపోయింది. పట్టాదారులైన రైతులు సహజంగా మరణించినా, ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయినా బాధిత కుటుంబానికి రూ.5 లక్షల బీమా మొత్తం చెల్లిస్తున్న విషయం తెలిసిందే. ఆగస్టు 14వ తేదీన బీమా రెన్యువల్ కావాల్సి ఉండగా.. ప్రభుత్వం ప్రీమియం చెల్లింపులు నిలిపివేసింది. దీంతో ఇక ఆ పథకం నిలిచిపోయినట్లేనని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.కాగా, రాష్ట్రవ్యాప్తంగా రైతులతోపాటు అన్ని కుటుంబాలకు జీవితబీమాను అమలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. దీంట్లో భాగంగానే, రైతు బీమా పథకాన్ని నిలిపివేసినట్లు సమాచారం. రాష్ట్రంలో రైతు బీమా పథకం ఎనిమిదేళ్లుగా అమలవుతోంది. ఏటా ఆగస్టు 14వ తేదీన రైతుల తరఫున రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం చెల్లిస్తోంది. ఎల్ఐసీ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఎంతో కొంత వ్యవసాయ భూమి ఉండి పట్టాదారు పాసుపుస్తకం కలిగిన రైతులను ఈ పథకంలో చేర్చారు. 18-59 ఏళ్ల వయసున్న రైతులు సహజ మరణం చెందినా, ప్రమాదవశాత్తు చనిపోయినా రైతు కుటుంబానికి రూ.5 లక్షలు చెల్లిస్తున్నారు.ఈ పథకంలో 42.16 లక్షల మంది రైతులు లబ్ధిదారులుగా ఉన్నారు. ఏటా సగటున రూ.1400 కోట్ల ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది. 2025-26 సంవత్సరానికి సంబంధించిన బీమా గడువు శుక్రవారంతో ముగిసింది. 2026-27 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం చెల్లించలేదు. 2018లో రైతుబీమా పథకం ప్రారంభం కాగా.. 2018-19లో 17,747 మంది, 2019-20లో 19,063 మంది, 2020-21లో 29,163 మంది, 2021-22లో 23,393 మంది, 2022-23లో 23,555 మంది, 2023-24లో 26 వేల మంది, 2024-25లో 26,089 మంది, 2025-26లో 21,353 మంది రైతులు మరణించారు. వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రైతుబీమా ఆర్థిక సాయం లభించింది.

**ఇందిరమ్మ కుటుంబ బీమాకు 4 వేల కోట్లు**

రైతులకే కాకుండా రాష్ట్రంలో ఉన్న ప్రతి కుటుంబానికి కూడా బీమా సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే సరికొత్త బీమా పథకాన్ని అమలు చేస్తామని గత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించింది. 2026-27 వార్షిక బడ్జెట్‌లో రూ.4 వేల కోట్ల నిధుల కేటాయింపులు జరిపింది. ఈ ఏడాది జూన్ రెండో తేదీ నుంచి 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పేరుతో ఈ పథకాన్ని అమలు చేస్తామని పేర్కొన్నప్పటికీ.. ప్రారంభం కాలేదు. ఇటీవల జనగామ జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటించిన సందర్భంగా.. నవంబరు 19వ తేదీన ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా బీమా పథకాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు. లబ్ధిదారుల ఎంపిక, వివరాల నమోదు కోసం ఇంటింటి సర్వే చేపడతామన్నారు. కుటుంబ యజమానికి లేదా ఇంటి బాధ్యతలు నిర్వర్తించే వ్యక్తికి రూ.5 లక్షలు బీమా చేస్తామని ప్రకటించారు.

**ఆ కుటుంబాలకు ఆసరా కోసం..**

'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' కింద.. ఇంటి యజమాని మరణించిన కుటుంబానికి బీమా సొమ్ము చెల్లిస్తారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి అకస్మాత్తుగా చనిపోతే... పిల్లల చదువులు ఆగిపోవటం, రోజువారీ ఖర్చులకు ఇబ్బందులు కలగటం వంటి సమస్యలతో ఆ కుటుంబం చితికిపోకుండా రూ.5 లక్షల ఆర్థిక సాయం ఉపయోగపడుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు వెలువడితేనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. అయితే, ఇది అమలు కావటానికి ఇంకా 3 నెలల వ్యవధి ఉన్నందున.. ఈ మధ్య కాలంలో మరణించే రైతుల కుటుంబాల పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. రైతు బీమా పథకం నిలిచిపోయిన నేపథ్యంలో ఆయా కుటుంబాలకు సొమ్ము లభించే అవకాశం లేదు. దీనిపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

# డబుల్ ఇంజిన్ గొప్పలేంటి?




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కేంద్ర పాలకులు 'డబుల్ ఇంజిన్' అంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో సింగిల్ ఇంజిన్ నే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సాధించామని అన్నారు. దేశంలోని 28 రాష్ట్రాలు పోటీపడి అభివృద్ధి సాధిస్తేనే భారత్ మరింత ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్లోని తెలంగాణ భవన్లో శనివారం నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కేటీఆర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

**ఓట్ల కోసం మత రాజకీయాలా?**

ఎన్నికలు రాగానే దేవుళ్ల పేర్లు చెప్పడం, అక్షింతలు పంచడం, మతం పేరుతో ఓట్లు అడగడం సరికాదని కేటీఆర్ అన్నారు. 80 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా కులం, మతం పేరుతో ఘర్షణలు జరగడం బాధాకరమన్నారు. దేశం నిజమైన అభివృద్ధి సాధించాలంటే కులమతాలకు అతీతంగా విద్య, ఉపాధి, మౌలిక వసతులు, ఆర్థిక ప్రగతిపై దృష్టి పెట్టాలని సూచించారు. 'సబ్కా సాత్.. సబ్కా వికాస్' నినాదం ఆచరణలో కనిపించడం లేదని విమర్శించారు.

**'కేసీఆర్ పాలన కావాలని ప్రజలు కోరుతున్నారు'**

పదేళ్ల కేసీఆర్ పాలనను ప్రజలు చూశారని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనతో పోల్చుకుంటూ మళ్లీ కేసీఆర్ పాలన రావాలని కోరుకుంటున్నారని కేటీఆర్ అన్నారు. కల్యాణలక్ష్మి,కంటి వెలుగు, 24 గంటల విద్యుత్ వంటి పథకాలను కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిందని గుర్తుచేశారు. నాయకుడికి చిత్తశుద్ధి, మంచి మనసు ఉంటేనే ప్రజలకు ఉపయోగపడే గొప్ప పథకాలు పుట్టుకొస్తాయని వ్యాఖ్యానించారు.

**'18 గంటలు ఎవరి కోసం?'**

ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి 18 గంటలు పనిచేస్తున్నానని చెబుతున్నారని, ఆ సమయం ఎవరి కోసం కేటాయిస్తున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. కుటుంబ సభ్యులకు భూములు కట్టబెట్టడంపైనే అంత సమయం పనిచేస్తున్నారా? అని విమర్శించారు. రైతులకు కనీసం యూరియా కూడా అందుబాటులో లేని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఎరువుల కోసం రైతులు క్యూలలో నిలబ దాల్సి వస్తోందన్నారు.

**'80 ఏళ్ల తర్వాతా ఈ దుస్థితి?'**

స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు గడిచినా కొన్ని గ్రామాలకు తాగునీరు. రోడ్లు, డ్లు. విద్యుత్ అందకపోవడం, పిల్లలకు నాణ్యమైన విద్య లభించ కపోవడం బాధాకరమని కేటీఆర్ అన్నారు. దేశంలో సమృద్ధిగా నీటి వనరులు ఉన్నప్పటికీ ప్రతి ఇంటికీ తాగునీరు, ప్రతి ఎకరానికి సాగునీరు అందడం లేదన్నారు. 24 గంటల విద్యుత్ అందించే సామర్థ్యం దేశానికి ఉందని పేర్కొన్నారు.

**చైనా దూసుకెళ్లింది.. మనమెక్కడ?**

45 ఏళ్ల క్రితం చైనా భారత్ కంటే పేద దేశంగా ఉన్నప్పటికీ నేడు అమెరికాతో పోటీపడే స్థాయికి ఎదిగిందని కేటీఆర్ అన్నారు. భారత్లో అన్ని వనరులు ఉన్నా ఆశించిన స్థాయిలో అభివృద్ధి సాధించలేకపోతున్నామని వ్యాఖ్యాని చారు. భారత యువత ఉద్యోగాలు, విద్య కోసం విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. దేశంలోనే ప్రపంచ స్థాయి విద్యాసంస్థలు, ఉపాధి అవకాశాలు కల్పించా ల్సిన అవసరం ఉందన్నారు.

**తెలంగాణదే కీలక పాత్ర**

జాతి నిర్మాణంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని కేటీఆర్ అన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.2 శాతంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి బాట పట్టాలంటే సమర్థ నాయకత్వం అవసరమన్నారు. రాబోయే రెండేళ్లు పార్టీ శ్రేణులు ప్రజా సమస్యలపై పోరాడాలని, జిల్లాలు, నియోజకవర్గాల్లో పార్టీ కార్యక లాపాలను విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు.



## పీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రేషన్ కార్డుల వంటి సంక్షేమ పథకాలపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోలు ఉండాలని బీజేపీ నేతలు చేస్తున్న డిమాండ్‌పై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. ప్రజలకు ఉపయోగపడే పనులపై దృష్టి పెట్టకుండా, అనవసరమైన అంశాలతో రాజకీయాలు చేయడం సరికాదని ఆయన హితవు పలికారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అర్హులైన పేదలకు ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా అందలేదని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. అప్పుడు మౌనంగా ఉన్న బీజేపీ నేతలు, ఇప్పుడు ప్రధాని మోడీ ఫొటోలను రేషన్ కార్డులపై ముద్రించాలని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. "ప్రధాని మోడీ ఫొటో లేకపోతే ఉద్యమం చేస్తామనడం వారి విద్వేశ రాజకీయ ఆలోచనలకు నిదర్శనం. దేశాన్ని, పదవులను ఎలా గౌరవించాలో కాంగ్రెస్ పార్టీకి బాగా తెలుసు, ఈ విషయంలో మాకు ఎవరి సర్టిఫికెట్లు అవసరం లేదు. మేము ప్రజా సమస్యల కోసం ఎన్నో ఉద్యమాలు చేశాం, కానీ ఇలాంటి అర్థం లేని డిమాండ్ల కోసం కాదు" అని ఆయన స్పష్టం చేశారు.

**విభజన హామీలపై దృష్టి పెట్టండి..**

బీజేపీ నేతలు ప్రజా ప్రయోజనం లేని అంశాలను పక్కన పెట్టి, విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీల అమలుపై కేంద్రంపై ఒత్తిడి తేవాలని మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రచారానికే బీజేపీ ప్రాధాన్యత ఇస్తుందని ఆయన ఆరోపించారు.

# ఇతర దేశాలపై ఆధారపడకూడదు

**న్యూ ఢిల్లీ :** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట బురుజులపై నుంచి ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగం దేశ పురోగతికి, ఆత్మనిర్భరతకు అద్దం పట్టింది. జెండా ఆవిష్కరణ అనంతరం దేశప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ పలు కీలకమైన అంశాలను ప్రస్తావించారు. ఒకవైపు దేశాభివృద్ధిని వివరిస్తూనే, మరోవైపు ఇటీవల ప్రకృతి వైపరీత్యాల వల్ల విలవిలలాడిన ప్రాంతాలను గుర్తు చేసుకున్నారు. వరదలు, కొండచరియలు విరిగిపడటం వల్ల సర్వస్వం కోల్పోయిన కుటుంబాలకు ప్రధాని మోదీ తన గాఢమైన సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టసమయంలో ప్రభుత్వం మాత్రమే కాదు, 140 కోట్ల మంది పౌరులతో కూడిన దేశమంతా బాధితులకు అండగా నిలుస్తుందని, వారికి అన్ని రకాలుగా పూర్తి సహాయసహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.అనంతరం జాతీయ గీతాల గొప్పతనాన్ని స్మరిస్తూ, ఈ ఆగస్టు 15న ఎర్రకోటపై తొలిసారిగా 'వందేమాతరం' నినాదాలు ప్రతిధ్వనించడం అత్యంత చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. వందేమాతరం గేయం రూపుదిద్దుకుని 150 ఏళ్లు పూర్తవుతున్న శుభతరుణంలో ఈ ఘటన జరగడం మరింత ప్రత్యేకతను సంతరించుకుందని మోదీ హర్షం వ్యక్తం చేశారు. గడిచిన 12 ఏళ్ల కాలంలో భారతదేశం ఊహించని వేగంతో అభివృద్ధి పథంలో పయనిస్తోందని ప్రధాని గుర్తుచేశారు. దేశంలోని దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు, పేదలు, మధ్యతరగతి ప్రజలు, మహిళలు, యువత, వృద్ధులు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల పౌరులందరి కృషి, పట్టుదలే ఈ పురోగతికి ప్రధాన కారణమని వారి సేవలను కొనియాడారు. ఈ 12 ఏళ్ల ప్రయాణంలో సాధించిన విజయాల గణాంకాలను వివరిస్తూ.. దేశంలో రక్షణ రంగ ఉత్పత్తి 4 రెట్లు, ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తి దాదాపు 5 రెట్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం 7 రెట్లు పెరిగాయని వెల్లడించారు. వీటితో పాటు ఆధునిక రైల్వే కోచ్‌ల తయారీ 21 రెట్లు పెరగ్గా, మొబైల్ ఫోన్ల ఉత్పత్తి ఏకంగా 33% పెరిగిందని తెలిపారు. అలాగే దేశవ్యాప్తంగా డిజిటల్ లావాదేవీలు 100% వృద్ధిని నమోదు చేయడం భారత్ సాధించిన సాంకేతిక విప్లవానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారతదేశం పూర్తిస్థాయి 'అభివృద్ధి చెందిన దేశం'గా (డిజిటల్ అండ్ డెవలప్డ్ నేషన్) మారినప్పుడు, జగత్తు మన దేశాన్ని చూసే కోణమే పూర్తిగా మారిపోతుందని ధీమా వ్యక్తం చేశారు.దేశానికి అత్యంత కీలకమైన ఇంధన భద్రత పై ప్రధాని ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఒకప్పుడు దేశీయంగా ఏమీ చేయలేక 'నో-గో' ఏరియా'లుగా ఉన్న రంగాలను ఇప్పుడు 'గో-అహెడ్ ఏరియా'లుగా మార్చేశామని చెప్పారు. ఇంధన అవసరాల కోసం భారత్ సాధిస్తున్న పురోగతిలో భాగంగా ఈ ఏడాది 'ఫాస్ట్ బ్రీడర్ న్యూక్లియర్ టెక్నాలజీ'లో అగ్రస్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని కైవసం చేసుకోవడం పరమావధి అని, ఇది అణు ఇంధన రంగంలో స్వయంసమృద్ధికి పెద్ద పీట వేస్తుందని వ్యాఖ్యానించారు. కొరత వనరులలో లేదని, మన ఆలోచనా పరిమితుల్లోనే ఉండిపోతుందని.. ఆలోచనలు పరిమితమైనప్పుడు మన సొంత సామర్థ్యాన్ని కూడా గుర్తించలేమని హెచ్చరించారు. అందుకే భవిష్యత్తు అవసరాల కోసం 200 గిగావాట్ల అణుశక్తిని లక్ష్యంగా పెట్టుకుని, కొత్తగా 5 అణు రియాక్టర్లను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు.మరోవైపు ఇంధన అన్వేషణలో భాగంగా ఒకప్పుడు భారతదేశంలో 98% తీరప్రాంత ఇంధన నిల్వల అన్వేషణపై ఉన్న ఆంక్షలను సవరించి, చమురు, సహజ వాయువు అన్వేషణల కోసం ఈ ప్రాంతాలను పూర్తిగా అందుబాటులోకి తెచ్చినట్లు మోడీ వివరించారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ప్రోత్సహిస్తూ.. ఇప్పటివరకు దేశంలో 1.75 కోట్ల ఇళ్లకు పైప్డ్ గ్యాస్ కనెక్షన్లు అందించామని, అలాగే 50 లక్షలకు పైగా గృహాలు సోలార్ విద్యుత్‌ను వినియోగిస్తున్నాయని తెలియజేశారు. పరాయి దేశాలపై ఆధారపడటం మాని, జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు స్వయంసమృద్ధిని మరింత బలోపేతం చేసుకోవాలని మోదీ పిలుపునిచ్చారు. 'ఆత్మనిర్భర భారత్' సాధనే ధ్యేయంగా అడుగులు వేస్తున్నామని, ప్రస్తుతం ప్రతి భారతీయుడు 'మేక్ ఇన్ ఇండియా', 'స్వదేశీ', 'వోకల్ ఫర్ లోకల్' ఉద్యమాలతో మమేకమై దేశ పురోగతిలో భాగస్వామి అవుతున్నారని స్పష్టం చేశారు. మనం ఇతర దేశాలపై ఆధారపడకూడదు.. ఇతర దేశాలపై ఆధారపడితే మన సామర్థ్యం పెరగదు.. మన ప్రయోజనాలను మనమే కాపాడుకోవాలి.. అప్పుడే వికసిత్ భారత్ సాధ్యమవుతుందని ప్రధాని మోదీ తెలిపారు.

**ఒక గంట సమయం ఇవ్వండి.. : యువతను కోరిన మోదీ**

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ... 'దిమాగీ నక్సల్స్' పై సంచలన వ్యాఖ్యలు చేశారు. అడవుల్లో ఆయుధాలు పట్టిన నక్సలిజాన్ని విజయవంతంగా నిర్మూలించామని, సాయుధ నక్సల్స్ కనుమరుగైనా.. 'దిమాగీ నక్సల్స్' మిగిలి ఉన్నారని ప్రధాని అన్నారు.'దిమాగీ నక్సల్స్' ఒక అవకాశం కోసం ఎదురుచూస్తున్నారని, సమాజాన్ని తప్పుడు మార్గంలోకి లాగడానికి వారు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారని ప్రధాని మోదీ తెలిపారు. మనం వారిని గుర్తించి.. ఏకాకిని చేయాలని మోదీ సూచించారు. 3,500 మందికి పైగా భద్రతా సిబ్బంది నక్సలిజం పోరాటంలో అమరులయ్యారని, ఇది యుద్ధాల్లో ప్రాణాలు కోల్పోయిన వారికంటే ఎక్కువని ఈ సందర్భంగా గుర్తుచేశారు.అలాగే ప్రస్తుతం దేశంలో జరుగుతోన్న జనగణన గురించి ప్రస్తావించారు. దానిలో యువత చురుగ్గా పాల్గొనాలని మోదీ పిలుపునిచ్చారు. 'నేను అందరినీ ఒక సాయం చేయాలని అడుగుతున్నాను. జనగణన విషయంలో ఒక గంటా, రెండు గంటల సమయం కేటాయించండి. అది దేశానికి ఎంతో ఉపయోగపడుతుంది. గణన అంటే లెక్కలన్నీ ఒక దగ్గర రాసుకోవడం కాదు. జనాభా లెక్కల సమయంలో మీరు ఇచ్చే వివరాల ఆధారంగానే జాతీయ విధానాలు, పథకాలు రూపుదిద్దుకుంటాయి. దేశ ప్రగతికి ఆ లెక్కలు సూచీగా ఉంటాయి. అందుకే కచ్చితమైన, స్పష్టమైన సమాచారం ఇవ్వడం అత్యంత కీలకం' అని మోదీ పేర్కొన్నారు.ఎర్రకోట వేదికగా ప్రధాని మోదీ యువతకు తీపి కబురు చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ సదుపాయాన్ని అందిస్తున్నట్లు ప్రకటించారు. గడిచిన కొన్నేళ్లలో దేశంలో 650కి పైగా కొత్త విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేశామని తెలిపారు. జాతీయ విద్యా విధానం ద్వారా విదేశీ విశ్వవిద్యాలయాలు కూడా భారత్‌లోకి వస్తున్నాయని, మన యువత స్వదేశంలోనే విదేశీ డిగ్రీలు పొందే అవకాశం లభించిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# 2వ ద్వివార్షిక జష్న్-ఎ-సాలానా మహాసభ

1. భువనగిరి లో ఆగస్ట్ 20న సిల్సిలా-యే-ముఅజ్జమియా యాకూబియా '2వ ద్వివార్షిక జష్న్-ఎ-సాలానా' మహాసభ
2. ఖురాన్ మరియు ముస్లిం" అంశంపై భువనగిరి లో భారీ ధార్మిక సదస్సు
3. భువనగిరి ఎ.ఆర్. గార్డెన్‌లో ఆగస్ట్ 20న 'దీనీ వ ఇస్లాహీ తర్బియతీ ఇజ్తిమా'..

ప్రముఖ ఇస్లామిక్ పండితుల రాక!
భువనగిరి లో వైభవంగా '2వ ద్వివార్షిక జష్న్-ఎ-సాలానా'.. ఆగస్ట్ 20న భారీ ధార్మిక మహాసభ!



**భువనగిరి,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** సిల్సిలా-యే-ముఅజ్జమియా యాకూబియా భువనగిరి ఆధ్వర్యంలో "2వ ద్వివార్షిక దీనీ వ ఇస్లాహీ తర్బియతీ వ తబ్లీఘీ ఇజ్తిమా" (జష్న్-ఎ-సాలానా) కార్యక్రమాన్ని ఈ నెల 20వ తేదీ గురువారం (7 రబీ-ఉల్-అవ్వల్ 1448 హిజ్రీ) సాయంత్రం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భువనగిరి లోని కాజీ మొహల్లా, దర్గా సయ్యద్ జమాలుల్ బహర్ ఖాద్రీ సమీపంలో ఉన్న ఎ.ఆర్. గార్డెన్ (A.R. Garden) వేదికగా ఈ మహాసభ జరగనుంది.ఈ సదస్సులో ఖురాన్ మరియు ముస్లిం" అనే ముఖ్యమైన అంశంపై ప్రముఖ ఇస్లామిక్ పండితులు విస్తృతంగా ప్రసంగించనున్నారు.

**ప్రముఖుల సమక్షం - ఘనంగా ఏర్పాట్లు:**

**పర్యవేక్షణ (జేరే నిగ్రానీ):** ముఫక్కిర్-యే-ఖౌమ్ అలీ జనాబ్ అల్-హాజ్ మహమ్మద్ షేక్ మీరాన్ చౌదరి సాహెబ్ (నైబ్ సదర్ మర్కజీ కమిటీ జమియత్-ఉల్-అన్సార్ & చైర్మన్ గుల్షన్-ఎ-దాతార్ ఫౌండేషన్ భువనగిరి ).

**అధ్యక్షత (జేరే సదారత్):** ఖలీఫా-యే-నజ్మూల్ ఆరిఫీన్ పీర్-యే-కామిల్ హజ్రత్ మహమ్మద్ ముఅజ్జమ్ అలీ షా యాకూబీ నూరీ చిష్తీ అల్ ఖాద్రీ సాహెబ్ (బాణీ వ సర్పరస్త్ సిల్సిలా-యే-ముఅజ్జమియా యాకూబియా).

**ముఖ్య అతిథి:** ముఫక్కిర్-యే-ఇస్లామ్, ఖతీబుల్ ఉమ్మత్ హజ్రత్ మౌలానా ముఫ్తీ ఖారీ అహ్మద్ అలీ ఫలాహీ మజాహిరీ నఖ్షబంది సాహెబ్ (జూరత్ గుజరాత్ Jamia Faiz-e-Sulaimania శైఖుల్ హదీస్).ఈ కార్యక్రమంలో హజ్రత్ అల్లామా మౌలానా మహమ్మద్ అమ్జద్ అలీ షా యాకూబీ, హాఫిజ్ వ ఖారీ మహమ్మద్ మజీదుద్దీన్ నాజిమ్లతో పాటు పలువురు ఆధ్యాత్మిక వేత్తలు, మతపెద్దలు ప్రసంగించనున్నారు.

**సమయ వేళలు & సమాచారం..**

**భోజన సౌకర్యం:** సాయంత్రం మగ్రిబ్ ప్రార్థనల నుండి ఇషా ప్రార్థనల వరకు తఆమ్ (భోజనం) ఏర్పాటు చేయబడింది.

**కార్యక్రమ ప్రారంభం:** ఇషా నమాజ్ తర్వాత సభ ప్రారంభమవుతుంది. నిర్వాహకులు సమయపాలన పాటించబడుతుందని స్పష్టం చేశారు.

ధార్మిక పరిజ్ఞానం, సమాజ శ్రేయస్సును కాంక్షించే ఇల్మ్ ప్రేమికులు, సోదరులుందరూ ఈ పవిత్ర కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా గుల్షన్ దాతార్ ఫౌండేషన్ మరియు సిల్సిలా ఖాదిమీన్ ప్రతినిధులు కోరారు.

## వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని శనివారం మిర్యాలగూడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో స్టేషన్ హౌస్ ఆఫీసర్ నాగభూషణరావు, స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ డి.బిక్కు నాయక్ తో పతాకావిష్కరణ చేపించి స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ వాసా ప్రవీణ్ కుమార్,పిఎస్ ఐ వెంకటేశ్వర్లు,బి. శ్రీనివాస్, లకుమల్ల బిక్షమయ్య,హెడ్ కానిస్టేబుల్ దైద సైదులు,పి. వెంకటేష్,గుగులోతు రాజారాం మరియు సిబ్బంది పాల్గొన్నారు.



ఈ రోజు సహచర లయన్ మిత్రుల తో కలిసి లయన్స్ క్లబ్ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది.

## ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**మేడిపల్లి, ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వయించారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమంలొ డిప్యూటీ కమీషనర్ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు డివిజన్ అధ్యక్షులు,స్థానిక నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అడవిదేవులపల్లి పోలీస్ స్టేషన్ లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**అడవిదేవులపల్లి, ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శేఖర్ జాతీయ జెండాను ఆవిష్కరించి,జెండాకు గౌరవ వందనం చేశారు. అనంతరం ఎస్ఐ శేఖర్ స్వాతంత్ర్య దినోత్సవం యొక్క గొప్పతనం,దేశ స్వాతంత్ర్యం కోసం స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలు,దేశం పట్ల ప్రతి ఒక్కరి బాధ్యత గురించి పోలీస్ సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,స్థానిక ప్రజలు పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## మోడల్ స్కూల్ లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు..



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నాగార్జునసాగర్ నియోజకవర్గం,గుర్రంపోడ్ మండల కేంద్రంలో మోడల్ స్కూల్ లో 80 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అట్టహసంగా నిర్వహించారు ఇట్టి కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్,అధ్యాపకులు కలిసి ముఖ్యఅతిథిగా ఏకే ఫౌండేషన్ చైర్మన్,హైకోర్టు న్యాయవాది కట్టెబోయిన అనిల్ కుమార్ ను ఆహ్వానించారు.ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు స్వాతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు తెలుపుతూ దేశ స్వాతంత్రం కోసం ఎందరో మహానుభావులు ప్రాణాలు అర్పించారని వారి ప్రాణ త్యాగాలను గుర్తు చేసుకుంటూ స్వాతంత్ర దినోత్సవం యొక్క విశిష్టతను తెలుసుకొని రాజ్యాంగ విలువలకు కట్టుబడి జీవించాలని గుర్తు చేశారు.కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయి అని కొనియాడారు.

# వెలువర్తిలో మహా రక్తదాన శిబిరం



**వలిగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో వెలువర్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శనివారం మహా రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథులుగా రామన్నపేట సీఐ రవి, స్థానిక ఎంపీడీవో జలంధర్ రెడ్డి, ఎస్సై శ్రీకాంత్ రెడ్డి లు హాజరై శిబిరాన్ని ప్రారంభించి వారు మాట్లాడుతూ వెలువర్తి గ్రామంలో మహా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన యూత్ అసోసియేషన్ సభ్యులకు అదేవిధంగా రక్తదానం చేసి మరొకరి ప్రాణాలు కాపాడే 32 మంది రక్త దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా సమాజానికి అవసరమయ్యే ఇలాంటి కార్యక్రమాలు చేస్తూ వచ్చే తరం యువతకు ఆదర్శప్రాయంగా ఉండాలని అభినందించారు. ఈ రక్తదాన శిబిరాన్ని యాదాద్రి తలసేమియా బ్లడ్ సెంటర్ భువనగిరి, యశోద హాస్పిటల్ మలక్ పేట్ డాక్టర్లచే హెల్త్ చెకప్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెలువర్తి యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కూచిమల్ల సుధాకర్, గౌరవాధ్యక్షులు ఉక్కుర్తి లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లం నరేష్, దాసబోయిన వెంకట్, బూడిద రాజు, ఉపాధ్యక్షులు వేముల మణికాంత్, ఉపేందర్, ప్రధాన కార్యదర్శి కూచిమల్ల నాగేష్, కార్యదర్శి మల్లం మహేష్, మల్లం భాను, బుడిగె బాలకృష్ణ, ఇంజమూరి శేఖర్, కూచిమల్ల శ్రీకాంత్, ఎడవల్లి విజయ్, కూచిమల్ల నాగేంద్ర, కోశాధికారి మల్లం సాయి, సంస్కృతి కార్యదర్శి మల్లం వెంకటేశం, బూడిద కిషన్ కూచిమల్ల కుమార్, సహాయకార్యదర్శి కలుకూరి మహేష్, సర్పంచ్ చెముడాల అనిత నర్సింగ్, ఉప సర్పంచ్ బూడిద నాగరాజు, వార్డు మెంబర్లు, సెక్రటరీ జి. గిరిబాబు, మాజీ యూత్ అధ్యక్షులు ఎడవల్లి నరసింహ, బైరు సైదులు, తుమ్మల వెంకటరెడ్డి, ముద్దసాని కిరణ్ రెడ్డి, కేర్చిపల్లి సర్పంచ్ మద్దెల మంజుల, కలుకూరి రాములు, కాసుల పెద్దలు, చెవ్వ వెంకటేశం, నానమాల ఉప్పలయ్య, గుండు శేఖర్, కలుకూరి లక్ష్మణ్, ఎల్లయ్య, బూడిద బిక్షం, మల్లం హరిప్రసాద్, ఎడవల్లి జయప్రకాష్, శామల కొండల్ రెడ్డి, చెవ్వ మధు, చెముడాల మల్లేష్, బూడిద రాజు తదితరులు పాల్గొన్నారు.

# కటింగ్ షాపుల బంద్ విజయవంతం..



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని రేట్లు పెరుగుదల పై కటింగ్ షాపుల బందు ను నాయి బ్రాహ్మణులు శనివారం సంపూర్ణంగా బందు నిర్వహించడం జరిగిందని పట్టణ అధ్యక్షుడు రాయించు నరసింహ అన్నారు. అనంతరం పట్టణంలోని చింతపల్లి బైపాస్ రోడ్ లో గల నూతన కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి ఆలగడప గిరిధర్ హాజరై సంఘ సభ్యులతో కలిసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులు అందరూ కలిసికట్టుగా ఉంటే సాధించలేనిది ఏది ఉండదని,సంఘ సభ్యులు సూచించిన రేట్ల ప్రకారం ప్రతి ఒక్కరు తీసుకోవాలని సంఘం యొక్క నియమ నిబంధన ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. అనంతరం రేట్ల పట్టిక పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవఅధ్యక్షులు,మాజీ అధ్యక్షులు,జిల్లా సంఘ సభ్యులు,సీనియర్ సంఘ సభ్యులు,కోశాధికారి,కార్యదర్శి పట్టణ సర్వ సభ్యులు,నాయి బ్రాహ్మణ సోదరులందరూ పాల్గొన్నారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ



**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జనగామ పురపాలక సంఘం కార్యాలయంలో 2026 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురపాలక సంఘం కార్యాలయ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గౌరవ చైర్పర్సన్ గారు, గౌరవ కౌన్సిలర్లు, పురపాలక సంఘం ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొని దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటారు. కార్యక్రమ ప్రాంగణాన్ని జాతీయ పతాక రంగులతో అలంకరించి, సాంస్కృతిక వాతావరణంలో వేడుకలను నిర్వహించారు.



**పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా వర్షాకాలంలో ప్రజలకు నిరంతర పారిశుద్ధ్య సేవలు అందిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. పురపాలక సంఘం పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారని, వారి సేవలు అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం, భద్రతకు పురపాలక సంఘం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ చైర్‌పర్సన్ గారు, గౌరవ కమిషనర్ గారు, గౌరవ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఇట్లు
కమిషనర్,
పురపాలక సంఘం, జనగామ.

# ప్రజలు కరువుతో అల్లాడుతుంటే యాగాలా



**గుర్రంపోడు,ఫ్లాష్ ఇండియా :** ఒకపక్క అన్నదాతలు కరువుతో అల్లాడుతున్నారు.. సాగునీరు లేక, తాగునీరు దొరక్క గ్రామీణ ప్రజలు నరకం చూస్తున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం ప్రజాధనాన్ని యాగాల పేరుతో వృథా చేస్తున్నారని నల్గొండ జిల్లా గుర్రంపోడులో బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గుర్రంపోడు మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా నాగులవంచ తిరుపతిరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కరువు పరిస్థితులు వస్తాయని ముందే హెచ్చరికలు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఒకపక్క అన్నదాతలు కన్నీరు పెడుతుంటే, మరోపక్క కోట్ల రూపాయల ప్రజల సొమ్మును యాగాల పేరిట దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు దోటి గణేష్ మాట్లాడుతూ అధికారం లేనప్పుడు ప్రస్తుత ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి గిరిజన యాత్రల పేరిట ఊరూరా తిరిగారని, ఇప్పుడు ప్రజలు కరువుతో కష్టాలు పడుతుంటే ఆయనకు ప్రజల గోస వినిపించడం లేదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే తక్షణమే ఏసీ రూమ్‌లు వదిలి ప్రతి గ్రామంలో పర్యటించాలని, కరువు ప్రాంతాలను గుర్తించి, నష్టపోయిన ప్రజలకు తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం కామల్ల రాములు మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్భాటాలకు పోకుండా ప్రజాధనాన్ని వృథా చేయడం ఆపాలని, ఆ నిధులతో ప్రజలకు అత్యవసరంగా ఉపయోగపడే పనులను వెంటనే చేపట్టాలని, కరువు ప్రాంతాలను అధికారికంగా గుర్తించి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, మైనార్టీ మాజీ అధ్యక్షులు షేక్ సిరాజ్, ఉప సర్పంచ్ నాగలవంచ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**మేడిపల్లి, ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్, బోడుప్పల్ సర్కిల్ 9వ డివిజన్ మేడిపల్లి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో పన్నాల శ్రీనివాస్ రెడ్డి, రమేష్,బలరాం, జయందర్,కుమార్, వేణుగోపాల్ రెడ్డి, సోమయ్య, శ్రవణ్, శరత్, కపిల్, భరత్, సుధాకర్,అమీర్, యేసు,ఎన్ ఎన్ ఎన్ దుర్గా, పరమేశ్వరి,శ్రీలత మరియు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**మేడిపల్లి, ఫ్లాష్ఇండియా ప్రతినిధి :**

మేడిపల్లి,ఫ్లాష్ఇండియా: మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమంలొ మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించే గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు నాయకులు,మహిళలు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అంగరంగవైభవంగా నిర్వహించారు





**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్హాలోమ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరితో కలిసి ముఖ్య అతిథిగా ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొని, జాతీయ జెండాను ఎగురవేశారు. జాతీయ గీతాలాపన చేశారు. అనంతరం పోలీసు కవాతులో పాల్గొని, గౌరవ వందనాన్ని స్వీకరించారు. తదనంతరం జిల్లా ప్రగతిపై సందేశాన్ని అందిస్తున్నారు.

## బాపూజీ నగర్ మైక్రో లెర్నింగ్ సెంటర్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ పట్టణం బాపూజీ నగర్‌లోని తానల్ ఎన్జీవో,మైక్రో లెర్నింగ్ సెంటర్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను విష్కరించి,జెండాకు గౌరవ వందనం చేశారు. అనంతరం విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం యొక్క గొప్పతనం,దేశ స్వాతంత్ర్యం కోసం స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలు,దేశం పట్ల ప్రతి ఒక్కరి బాధ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మలబార్ గ్రూప్ స్టోర్ హెడ్ సమీర్, తానల్ తెలంగాణ స్టేట్ హెడ్ అజ్మల్,నల్గొండ జోనల్ హెడ్ అలంపల్లి సతీష్,టీచర్ మెహరాజ్ ,స్థానిక కౌన్సిలర్లు సందేశీ రజినీ,ఆంజనేయరాజ్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి గీతాలు,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి జాతీయ భావాన్ని చాటుకున్నారు.

## ఆచూకీ కోసం పోలీసుల ఆరా

**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం వెలుగుచూసింది. సుమారు 45 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి మృతదేహం ఆసుపత్రి ఆవరణలో కనిపించడంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద అతడిని గుర్తించేందుకు ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుడికి జుట్టు, గడ్డం బాగా పెరిగి ఉన్నాయని, సుమారు 5.4 అడుగుల ఎత్తు ఉంటాడని పోలీసులు తెలిపారు. మృతుడిని ఎవరైనా గుర్తించినా, అతడి కుటుంబ సభ్యులు లేదా బంధువుల గురించి సమాచారం తెలిసినా ఖమ్మం రెండో పట్టణ పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు. మృతుడి వివరాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్..!



శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా తొలి టెస్టు గాలే వేదికగా ప్రారంభమైంది. ఈ మ్యాచ్‌లో టీమిండియా టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నిర్ణయం తీసుకున్నాడు. ఈ మ్యాచ్‌తో భారత టెస్టు క్రికెట్ చరిత్రలో ఓ కీలక మైలురాయి నమోదైంది. భారత్‌కు ఇది 600వ టెస్టు మ్యాచ్. అలాగే గాలే వేదికగా జరుగుతున్న టెస్టు మ్యాచ్‌ల సంఖ్య 50కి చేరింది. టీమిండియా తుది జట్టు ఎంపికలో సర్ఫరాజ్ ఖాన్‌కు మరోసారి నిరాశ ఎదురైంది. అతడికి తుది జట్టులో చోటు దక్కలేదు. సర్ఫరాజ్ ఆడతాడని అంచనాలు ఉన్నప్పటికీ, టీమ్ మేనేజ్‌మెంట్ ధ్రువ్ జురెల్‌కు అవకాశం కల్పించింది. దీంతో రిషభ్ పంత్ వికెట్ కీపర్‌గా కొనసాగుతుండగా.. జురెల్ బ్యాటింగ్ విభాగంలో అదనపు ఎంపికగా ఉన్నాడు. గాలే పిచ్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని భారత్ ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు పేసర్ల కాంబినేషన్‌తో బరిలోకి దిగింది. రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, మానవ్ సుతార్ స్పిన్ బాధ్యతలు చేపట్టనున్నారు. మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ పేస్ బౌలింగ్ ను నడిపించనున్నారు. మరోవైపు శ్రీలంక జట్టులో ఆఫ్‌స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ కేశర నువాంత అరంగేట్రం చేస్తున్నాడు. ఇప్పటివరకు అతడు 15 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు మాత్రమే ఆడగా.. కొలంబోలోని ఎన్‌సీసీలో జరిగిన టూర్ మ్యాచ్‌లో మూడు వికెట్ల మ్యాచ్ హాల్ సాధించాడు. అంతకుముందు గాలే వేదికగానే ఇండియా-Aతో జరిగిన మ్యాచ్‌లో ఐదు వికెట్లు పడగొట్టాడు.

**తుది జట్లు..**

**భారత్:**
యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషభ్ పంత్ (వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, మానవ్ సుతార్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ.

**శ్రీలంక:**
లాహిరు ఉదారా, నిషాన్ మదుష్క, దినేశ్ చండిమాల్, కమిందు మెండిస్, ధనంజయ డిసిల్వా (కెప్టెన్), సోనాల్ దినుష, నిరోషన్ డిక్వెల్లా (వికెట్ కీపర్), కేశర నువాంత, ప్రభాత్ జయసూర్య, లాహిరు కుమార, అసిత ఫెర్నాండో.

# అరంగేట్రంలోనే వరల్డ్ రికార్డ్



స్కాట్లాండ్ యువ ఆటగాడు లైల్ రాబర్ట్‌సన్ తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌ను ఘనంగా ఆరంభించాడు. ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్ లీగ్-2లో భాగంగా డండీ వేదికగా కెనడాతో జరిగిన మ్యాచ్‌లో రాబర్ట్‌సన్ ఇంటర్నేషనల్ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. ఈ ఏకపక్ష పోరులో రాబర్ట్‌సన్ బంతితో మ్యాజిక్ చేశాడు. అంతేకాక ప్రపంచ రికార్డును క్రియేట్ చేశాడు. తన 10 ఓవర్ల కోటాలో 52 పరుగులిచ్చి ఏకంగా 6 వికెట్లు పడగొట్టాడు. తద్వారా వన్డేల్లో అరంగేట్ర మ్యాచ్‌లో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన స్పిన్నర్‌గా రాబర్ట్‌సన్ చరిత్ర సృష్టించాడు. ఇంతకుముందు ఈ రికార్డు పాకిస్థాన్ స్పిన్నర్ అరాఫత్ మిన్హాస్ పేరిట ఉండేది. అతడు 32 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు సాధించాడు. తాజాగా కెనడాతో జరిగిన ఈ మ్యాచ్‌తో అరాఫత్ రికార్డును 23 ఏళ్ల రాబర్ట్‌సన్ బ్రేక్ చేశాడు. మొత్తంగా వన్డే డెబ్యూలో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన రెండో బౌలర్‌గా కగిసో రబాడ వంటి దిగ్గజాలు సరసన ఈ స్కాటిష్ స్పిన్నర్ నిలిచాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 కోల్పోయి 347 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం 348 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కెనడాను 177 పరుగులకే కుప్పకూలింది. కెనడా ఓటమిలో రాబర్ట్‌సన్ కీలక పాత్ర పోషించాడు. ఫలితంగా స్కాట్లాండ్ 170 పరుగుల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో స్కాట్లాండ్ జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది.



# ఆసియా కప్, ఆసియా క్రీడలకు స్టార్ బ్యాటర్ దూరం..

భారత మహిళా క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ జెమిమా రోడ్రిగ్స్ తొడ కండరాల గాయం కారణంగా రాబోయే మహిళల ఆసియా కప్, ఆసియా క్రీడలకు దూరమయ్యారు. ఈ విషయాన్ని భారత క్రికెట్ నియంత్రణ మ్యాగజైన్ లేదా బోర్డు (బిసిసిఐ) అధికారికంగా ధృవీకరించింది. ఈ నెల ప్రారంభంలో ఇంగ్లాండ్‌లో జరిగిన 'ది హండ్రెడ్' టోర్నమెంట్ ఆడుతున్న సమయంలో ఆమె కుడి కాలు కండరానికి తీవ్ర గాయమైంది. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించగా, అది 'హై-గ్రేడ్ టియర్' అని నిర్ధారణ అయింది. ఈ గాయం నుంచి కోలుకోవడానికి సమయం పడుతుండటంతో ఆమె యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా జరిగే ఆసియా కప్, అలాగే జపాన్ లోని ఐచి-నాగోయాలో జరగనున్న ఆసియా క్రీడల నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. జెమిమా స్థానంలో మహిళల ఎంపిక కమిటీ ప్రతికా రావల్‌ను ఆసియా కప్ జట్టులోకి ఎంపిక చేసింది. మోకాలి గాయం కారణంగా ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌కు దూరమైన రావల్, ఇప్పుడు కోలుకుని తిరిగి జాతీయ జట్టులోకి పునరాగమనం చేస్తున్నారు. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 13 వరకు యూఏఈలో ఆసియా కప్ జరగనుంది. ఈ టోర్నీలో భారత జట్టు గ్రూప్-ఎలో పాకిస్తాన్, థాయిలాండ్, హాంకాంగ్‌లతో కలసి పోటీపడనుంది. భారత్, పాకిస్తాన్ మధ్య అత్యంత ఆసక్తికరమైన మ్యాచ్ సెప్టెంబర్ 5న దుబాయ్‌లో జరగనుంది. ఆ తర్వాత సెప్టెంబర్ 19 నుండి అక్టోబర్ 4 వరకు జపాన్‌లో ఆసియా క్రీడలు జరగనున్నాయి.


**భారత ఆసియా కప్ జట్టు అంచనా:** హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షెఫాలీ వర్మ, భారతి ఫుల్మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి కమాలిని (వికెట్ కీపర్), అరుంధతి రెడ్డి, ప్రేమా రావత్, రాధా యాదవ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, నందిని శర్మ, క్రాంతి గౌడ్ , ప్రతికా రావల్.

# సెంచరీతో కదం తొక్కిన హసన్..



ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో ఊహించని పరిణామాలు చోటుచేసుకున్నాయి. రెండో రోజు ఆటలో బంగ్లాదేశ్ యువ ఓపెనర్ తంజీద్ హసన్ బాధ్యతాయుతమైన శతకంతో చెలరేగగా.. మైదానంలో ఆటగాళ్ల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. చాలా సేపటి నుంచి బౌలింగ్ చేసి విసిగిపోయిన ఆస్ట్రేలియా స్టార్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ తన సహనాన్ని కోల్పోయాడు. ఇన్నింగ్స్ 103వ ఓవర్‌లో బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మెహదీ హసన్ మిరాజ్ సింగిల్ తీసే క్రమంలో పిచ్ మధ్యలో నుంచి పరుగెత్తుతూ స్టార్క్‌కు ఎదురొచ్చాడు. దీంతో ఆగ్రహానికి గురైన స్టార్క్ "ఇది నా ఫాలో త్రూ, నీది కాదు.. పిచ్ మీద నుంచి తప్పుకో, ఇది బంగ్లాదేశ్ కాదు" అంటూ తీవ్రంగా హెచ్చరించాడు. వెంటనే స్పందించిన ఆన్-ఫీల్డ్ అంపైర్ కుమార ధర్మసేన జోక్యం చేసుకుని మిరాజ్‌ను హెచ్చరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ గొడవను పక్కన పెడితే.. మ్యాచ్‌పై బంగ్లాదేశ్ పూర్తి ఆధిపత్యం చెలాయిస్తోంది. మొదటి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియాను కేవలం 198 పరుగులకే పరిమితం చేసిన బంగ్లాదేశ్, బ్యాటింగ్‌లో అద్భుత ప్రదర్శన చేసింది. ఓపెనర్ తంజీద్ హసన్ (101) అద్భుత శతకంతో ఇన్నింగ్స్‌కు ప్రధాన బలంగా నిలిచాడు. ఇతనికి తోడుగా మొమినుల్ హక్ (49), కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ షాంటో (84) కీలక భాగస్వామ్యాలు నెలకొల్పడంతో బంగ్లాదేశ్ భారీ స్కోరు సాధించింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ 6 వికెట్ల నష్టానికి 351 పరుగులు చేసి, ఆస్ట్రేలియాపై ఏకంగా 153 పరుగుల భారీ ఆధిక్యాన్ని (లీడ్) సంపాదించింది. చివరిలో ఆస్ట్రేలియా బౌలర్లు కొత్త బంతితో మూడు వికెట్లు తీసి పుంజుకునే ప్రయత్నం చేసినప్పటికీ, తంజీద్ హసన్ చేసిన ఈ సెంచరీ మ్యాచ్ ఫలితాన్ని మార్చేసేలా బంగ్లాదేశ్‌ను సురక్షితమైన లీడ్‌లో నిలబెట్టింది.


## బిజినెస్



# యుద్ధ విమానాలకు ఇక దేశీయ ఇంజన్లు

భారత రక్షణ, ఏరోస్పేస్ రంగాలు ఆత్మనిర్భర్ భారత్ దిశగా అడుగులు వేస్తున్నాయి. భారత ప్రైవేట్ రంగ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ , బ్రిటన్‌కు చెందిన ప్రపంచ ప్రసిద్ధ ఏరో ఇంజిన్ తయారీ సంస్థ రోల్స్-రాయిస్ పరస్పర భాగస్వామ్యంలో రక్షణ రంగంలోని విడి భాగాల తయారీలోకి అడుగు పెడుతున్నట్టు ప్రకటించాయి. భారతదేశం అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమాన ప్రాజెక్ట్ 'అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్' కోసం సంయుక్తంగా స్వదేశీ ఫైటర్ జెట్ ఇంజిన్‌ను అభివృద్ధి చేసేందుకు ఇరు సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. భారత్‌లోనే ప్రత్యేకంగా ఒక 'ఏరోస్పేస్ గ్యాస్ టర్బైన్ కాంప్లెక్స్'ను 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపాయి. యుద్ధ విమాన ఇంజిన్ల డిజైన్, పరిశోధన-అభివృద్ధి , తయారీ, టెస్టింగ్, ఉత్పత్తి, సుదీర్ఘకాల నిర్వహణ తో సహా అన్ని ప్రక్రియలను దేశీయంగానే నిర్వర్తించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. రక్షణ అవసరాల కోసం విదేశీ సరఫరాదారులపై ఆధారపడటాన్ని తగ్గించి, క్లిష్టమైన సైనిక పరిజ్ఞానంలో భారత్‌కు వ్యూహాత్మక స్వావలంబన కల్పించడమే ఈ ప్రాజెక్ట్ యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ భాగస్వామ్యం కేవలం AMCA ఇంజిన్‌కే పరిమితం కాకుండా.. సివిల్ ఏరోస్పేస్, ఇతర రక్షణ రంగాలు, నూతన ప్రొపల్షన్ సిస్టమ్స్ నిర్మాణంలోనూ అవకాశాలను తెరిచే అవకాశం ఉందని ఇరు సంస్థలు స్పష్టం చేశాయి.

# ఉబర్, రాపిడో విలీనం..?





ఉబర్, రాపిడో... భారత రవాణా రంగంలో ఊపు తెచ్చిన రెండు ప్రముఖ రైడ్ హెయిలింగ్ దిగ్గజాలు. ఈ రెండూ ఒకటైపోతున్నాయా? విలీనానికి బాటలు పడుతున్నాయా? ఇందులో నిజమెంత..? తాజాగా ఉబర్ సీఈఓ భారత పర్యటన సందర్భంగా రాపిడో యాజమాన్యంతో విలీనంపై రహస్య చర్చలు జరిపినట్లు వార్తలు వెలువడటంతో రవాణా రంగంలో ఒక్కసారిగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే వ్యాపార నియంత్రణ, హక్కుల విషయంలో ఇరు సంస్థల మధ్య వ్యూహాత్మక అభిప్రాయ భేదాలు రావడంతో ఈ మెగా డీల్‌కు బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. అసలు ఆ చర్చల్లో ఏం జరిగింది? డీల్ ఎందుకు క్యాన్సిల్ అయిందో వివరంగా తెలుసుకుందాం.. అమెరికన్ రైడ్ హెయిలింగ్ దిగ్గజం ఉబర్, భారతీయ స్టార్టప్ రాపిడోల మధ్య దేశీయ విలీనం కోసం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఈ ఏడాది మే నెలలో ఉబర్ సిఈఓ దారా ఖోస్రోషాహి ఐదు రోజుల భారత్ పర్యటనకు వచ్చినప్పుడు ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. భారత మార్కెట్‌లో విస్తరిస్తున్న తీవ్ర పోటీ, నగదు వ్యయాన్ని తగ్గించుకోవడం, వ్యాపారాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా రెండు సంస్థల ఉన్నతాధికారులు విస్తృత చర్చలు జరిపారు. ఉబర్ సంస్థ తమ వ్యాపారాన్ని రాపిడోతో విలీనం చేసి, నిర్వహణ బాధ్యతలను రాపిడో యాజమాన్యానికి అప్పగించాలని భావించింది. అయితే, రాపిడో దీనికి భిన్నమైన ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. క్యాష్ అండ్ స్టాక్ లావాదేవీల రూపంలో ఉబర్ భారత వ్యాపారాన్ని పూర్తిగా తామే కొనుగోలు చేస్తామని, ఉబర్‌కు రాపిడోలో మైనారిటీ వాటా ఇస్తామని ప్రతిపాదించింది. కానీ, వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన భారత మార్కెట్‌పై నియంత్రణను పూర్తిగా వదులుకోవడానికి ఉబర్ ఏమాత్రం సిద్ధపడలేదు. 2020లో ఉబర్ ఈట్స్ వ్యాపారాన్ని జొమాటోకు విక్రయించినప్పటికీ, ప్రధాన రైడ్ హెయిలింగ్ విభాగంలో తన ఉనికిని కోల్పోవడం ఉబర్‌కు ఇష్టం లేదు. యాజమాన్య హక్కుల విషయంలో ఇరు సంస్థల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ డీల్ ప్రాథమిక దశలోనే నిలిచిపోయింది. ప్రస్తుతం భారత్‌లో రాపిడో బైక్ టాక్సీ విభాగంలో ఆధిపత్యంతో మొత్తం రైడ్ మార్కెట్లో 50 శాతం వాటాను కలిగి ఉండగా, ఉబర్ ఫోర్ వీలర్ క్యాబ్ విభాగంలో 40-45 శాతం వాటాతో బలంగా ఉంది. ఒకవేళ ఈ విలీనం జరిగి ఉంటే భారత రవాణా రంగంలో ఓలా తప్ప మరో పెద్ద పోటీదారు ఉండేవాడు కాదు. ఇది మార్కెట్ పోటీపై ప్రభావం చూపే అవకాశం ఉండేది. కాగా, ఈ విలీన వార్తలను రాపిడో ఖండించగా, ప్రస్తుతం ఈ రెండు కంపెనీలు స్వతంత్రంగానే తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నాయి. రాపిడోకు పోటీగా ఉబర్ కూడా ఇటీవల తన బైక్ టాక్సీ సేవలను దాదాపు 220 నగరాలకు పెంచి, కొత్త సవాళ్లకు సిద్ధవవుతోంది.

# గ్యాస్ సిలిండర్ ధరలు



ఈ నెల(ఆగస్టు) 1వ తేదీన కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించిన విషయం తెలిసిందే. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.206 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.2,985గా ఉంది. గృహ వినియోగ ఎల్‌పీజీ ధరలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. ఈ రోజు(శనివారం) రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. ఆగస్టు 15వ తేదీన తెలంగాణలోని హైదరాబాద్ నగరంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.994.00గా, వరంగల్‌లో రూ.1013.00గా ఉంది. ఇక, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాలైన విశాఖపట్నంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.950.00గా, విజయవాడలో రూ.966.50, గుంటూరులో రూ.966.50గా ఉంది.




# పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరలు

ఈ రోజు(ఆగస్టు 15) పెట్రోల్ డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. ఈ తరుణంలో హైదరాబాద్‌లో ప్రస్తుతం పెట్రోల్ ధర లీటరుకు రూ.115.43గా ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ఈ రోజు(శనివారం) పెట్రోల్, డీజిల్ సీఎన్‌జీ ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.

**నేటి పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరలు..**

**హైదరాబాద్**
లీటర్ పెట్రోల్ ధర: రూ.115.43
లీటర్ డీజిల్ ధర రూ.103.58
సీఎన్‌జీ ధర:రూ.109.00

**వరంగల్**
లీటర్ పెట్రోల్ ధర: రూ.116.02
లీటర్ డీజిల్ ధర రూ.104.12
సీఎన్‌జీ ధర:రూ.108.00


**విశాఖపట్నం**
లీటర్ పెట్రోల్ ధర: రూ.117.52
లీటర్ డీజిల్ ధర రూ.105.15
సీఎన్‌జీ ధర:రూ.92.50

**విజయవాడ**
లీటర్ పెట్రోల్ ధర: రూ.117.25
లీటర్ డీజిల్ ధర రూ.104.96
సీఎన్‌జీ ధర:రూ.102.00




# రిలీజ్ డేట్‌పై ఆసక్తికర చర్చ

హనుమాన్ చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపును సంపాదించుకున్న ప్రశాంత్ వర్మ కథ, స్క్రీన్‌ప్లే అందిస్తున్న చిత్రం మహాకాళి. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వస్తున్న తొలి లేడీ ఓరియెంటెడ్ చిత్రంగా ఇది తెరకెక్కుతోంది. ఈ సినిమాకు అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో భూమి శెట్టి ప్రధాన పాత్రలో కనిపించనుండగా, అక్షయ్ కన్నా, రోహిత్ సరాఫ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆర్.కె. దుగ్గల్, రివాజ్ రమేష్ దుగ్గల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు ఈ సినిమాకు సంబంధించిన అధికారిక విడుదల తేదీని మేకర్స్ ప్రకటించలేదు.అయితే విడుదల తేదీకి సంబంధించి ఓ వార్త ప్రస్తుతం వైరల్ అవుతోంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 8న విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఇదే వార్త నిజమైతే వచ్చే ఏడాది సంక్రాంతి పోటీ మరింత రసవత్తరంగా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన హనుమాన్ చిత్రం కూడా సంక్రాంతి బరిలో నిలిచి భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే.



# సూపర్‌హిట్ డైరెక్టర్ ఫిక్స్

సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని 'శ్రీనివాస మంగాపురం' అనే చిత్రంతో వెండితెరకు పరిచయమైన విషయం తెలిసిందే. మంచి అంచనాల నడుమ విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడానికి పూర్తి కారణం తానేనని దర్శకుడు అజయ్ భూపతి స్వయంగా ఓ పోస్ట్ ద్వారా వెల్లడించారు. చాలాకాలం తర్వాత ఘట్టమనేని ఫ్యామిలీ నుంచి హీరోగా ఎంట్రీ ఇచ్చిన జయకృష్ణకు భారీ అపజయం ఎదురుకావడంతో అభిమానులు కూడా తీవ్ర నిరుత్సాహంలో ఉన్నారు. అయితే, అలాంటి అభిమానులకు నిర్మాత అనిల్ సుంకర అదిరిపోయే రేంజ్ ట్రీట్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. జయకృష్ణ రెండో సినిమాను తన ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మించనున్నట్లు సమాచారం.ఇప్పటికే ఇదే బ్యానర్‌లో 'సామజవరగమన' చిత్రంతో అద్భుతమైన విజయాన్ని అందుకున్న రామ్ అబ్బరాజు ఈ సినిమాకు దర్శకత్వం వహించబోతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రామ్ అబ్బరాజు ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో 'సామజవరగమన 2' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. జయకృష్ణ రెండో సినిమాకు సంబంధించిన స్టోరీ సెట్టింగ్స్ కూడా ఇప్పటికే పూర్తయినట్లు సమాచారం. 'సామజవరగమన 2' పూర్తయిన వెంటనే ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఘట్టమనేని అభిమానులకు అనిల్ సుంకర సూపర్ ట్రీట్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నారనే వార్త ఆసక్తిని కలిగిస్తోంది.

# 'ఫర్జీ 2' షూటింగ్ అప్డేట్ పంచుకున్న రాశీ ఖన్నా

షాహిద్ కపూర్, విజయ్ సేతుపతి, రాశీ ఖన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న లేటెస్ట్ క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'ఫర్జీ-2'. ఇందులో రాశీ ఖన్నా RBI అధికారి 'మేఘా వ్యాస్'గా మళ్లీ తెరపై కనిపించనుంది. ఈ క్రమంలోనే తాజాగా ఈ సినిమా షూటింగ్ అప్డేట్‌ను పంచుకుంది రాశి. ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్ వేదిక షూటింగ్ సెట్స్, క్యారవాన్ నుంచి కొన్ని ఫొటోలను షేర్ చేస్తూ.. 'ఫర్జీ-2' షూటింగ్‌లో జాయిన్ అయినట్లు తెలిపింది. 'ఆల్మండ్ మిల్క్‌తో కూడిన 'క్రంచీ రెడ్ హాట్ మోచా గ్రాండే' ఎవరి కోసం..?' అనే క్యాప్షన్‌తో షేర్ చేసిన ఈ పిక్స్ అభిమానులను ఆకర్షిస్తున్నాయి. కాగా.. 2023లో వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న సిరీస్ 'ఫర్జీ'. ఈ సిరీస్ ఎనిమిది భాగాలుగా అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదలై, ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందింది. ప్రముఖ చిత్రనిర్మాతల ద్వయం రాజ్ & డికె రూపొందించిన మొదటి భాగంలో షాహిద్, రాశీ, విజయ్ సేతుపతి, కే కే మీనన్, భువన్ అరోరా, రెజీనా కసాండ్ర, అమోల్ పాలేకర్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. ఇప్పుడు ఈ బ్లాక్ బస్టర్ 'ఫర్జీ'కు సీక్వెల్‌గా ఫర్జీ-2 రాబోతుండగా.. భారీ అచనాలు ఉన్నాయి. ఇక ఈ సీక్వెల్‌కు కూడా రాజ్ & డికె రూపొందిస్తున్నారు.







# ముఠామేస్త్రీ రీ రిలీజ్

మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు సెలెబ్రేట్ చేసుకునే న్యూస్ ఒకటి బయటికి వచ్చింది. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు కోదండరామిరెడ్డి, చిరంజీవి కాంబినేషన్‌లో వచ్చి ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన క్లాసిక్ మాస్ ఎంటర్‌టైనర్ 'ముఠామేస్త్రీ' మళ్లీ వెండితెరపై సందడి చేయడానికి సిద్ధమవుతోంది. 1993లో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లు సాధించి చిరంజీవి కెరీర్‌లో ప్రత్యేకమైన చిత్రంగా నిలిచింది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను అధునాతన 4ఖ డిజిటల్ వెర్షన్‌లో మేకర్స్ ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. ఈ నెల 22న మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని, ఒక రోజు ముందుగానే అంటే ఆగస్టు 21న 'ముఠామేస్త్రీ' 4ఖ వెర్షన్‌ను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో రీ రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది.చిరంజీవి మాస్ మేనరిజమ్‌కు జోడీగా మీనా, రోజా కథానాయికలుగా నటించగా, రాజ్-కోటి అందించిన సంగీతం అప్పట్లో పెద్ద సంచలనం సృష్టించింది. ఈ చిత్రంలోని పాటలు, చిరంజీవి డాన్సులు, పవర్‌ఫుల్ డెలివరీ డైలాగ్‌లు ఇప్పటికీ సినీప్రియులను విశేషంగా అలరిస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం టాలీవుడ్‌లో వింటేజ్ హిట్ సినిమాల రీ రిలీజ్ ట్రెండ్ నడుస్తుండటంతో, 'ముఠామేస్త్రీ' 4ఖ రీ రిలీజ్‌పై మెగా అభిమానుల్లో విపరీతమైన క్రేజ్ నెలకొంది.




# 'శనార్తి' ఫస్ట్ లుక్ రిలీజ్..

ఫోక్ సింగర్ కమ్ డ్యాన్సర్ నాగదుర్గ బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లతో టాలీవుడ్‌లో బిజీగా మారుతుంది. తమిళంలో 'లవ్ ఓ లవ్' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ఈమె.. ఇప్పుడు టాలీవుడ్‌లో తెలంగాణ నేపథ్య కథలతో వరుస సినిమాలు చేస్తుంది. ఇప్పటికే సుకుమార్, బన్నీ వాస్ నిర్మిస్తున్న 'ఇడుపుకాయితం'లో ప్రియదర్శి సరసన హీరోయిన్‌గా నటిస్తున్న నాగదుర్గ.. ఈ సినిమా షూటింగ్ జరుగుతుండగానే మరో కొత్త సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 'రాజు వెడ్స్ రాంబాయి' ఫేమ్ అఖిల్ రాజ్ హీరోగా నటిస్తున్న ఈ మూవీకి గణేశ్ రాజ్ ఉప్పునూతి దర్శకత్వం వహిస్తున్నాడు. సంపత్ నంది టీమ్ వర్క్స్, ఎస్‌డీఎల్‌పీ (శ్రీ ధనలక్ష్మి ప్రొడక్షన్స్) సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ కొత్త చిత్రానికి 'శనార్తి' అనే టైటిల్‌ను ఖరారు చేసి తాజాగా పూజా కార్యక్రమాలతో ఘనంగా సినిమాను ప్రారంభించారు. ఇక మొదటి సన్నివేశానికి టాలీవుడ్ టాప్ డైరెక్టర్ వివి వినాయక్ క్లాప్ కొట్టి.. చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్ తెలిపారు. తెలంగాణ యాస, భాషతో ఇప్పటివరకు టచ్ చేయని ఓ కొత్త పాయింట్‌తో ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుండగా.. రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చూస్తుంటే ఇందులో పెళ్లి ఎమోషన్ ప్రధానంగా అంశంగా ఉండబోతుందని అర్థం అవుతుంది. ఇక రిలీజ్ చేసిన ఈ పోస్టర్‌లో హీరో, హీరోయిన్ చేతులకు పసుపు, కుంకుమ రాసి ఉండటంతో సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్‌తోనే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాడు డైరెక్టర్.

# సంక్రాంతికి 'జార్జ్ క్రిష్'..




ఫ్యామిలీ హీరో శర్వానంద్-- డైరెక్టర్ శ్రీను వైట్ల కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా నేడు పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రరంభమైంది. ఈ సందర్భంగా సినిమా టైటిల్‌తో పాటు, విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రానికి 'జార్జ్ క్రిష్' అనే క్రేజీ టైటిల్‌ను ఖరారు చేయగా.. వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 14న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు వెల్లడించారు. అలాగే జనవరి 14వ తేదీకి పెద్దగా సమయం లేకపోవడంతో మూవీ షూటింగ్‌ను మరికొద్ది రోజుల్లోనే ప్రారంభించి, వీలైనంత త్వరగా చిత్రీకరణను పూర్తి చేయనున్నట్లు చెప్పుకొచ్చారు. అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రాంబ్రహ్మం సుంకర నిర్మించనున్నారు. అంతే కాకుండా.. సినిమా అనౌన్స్‌మెంట్ రోజునే.. డిస్ట్రిబ్యూటర్స్ నేమ్స్ కూడా రివీల్ చేసి సర్‌ప్రైజ్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా నిర్మాత రాంబ్రహ్మం సుంకర మాట్లాడుతూ.. ఈ సినిమాను నైజాం - ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్, వైజాగ్ - వాసుదేవ మూవీ క్రియేషన్స్, ఈస్ట్ - వింటేజ్ క్రియేషన్స్, వెస్ట్ - ఆదిత్య ఫిల్మ్స్, కృష్ణ - వ్యోమ్ సినిమాస్; గుంటూరు - =ఖ ఎంటర్‌టైన్‌మెంట్స్, నెల్లూరు - అభి సినిమాస్, సీడెడ్ - శిల్పకళ, ఓవర్సీస్ - వ్యోమ్ సినిమాస్ అండ్ సినిమా పరదిసో విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు.




# ఎర్లీ మార్నింగ్ 4గంటలకు నన్ను ఎవరో..

ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న బీటౌన్ బ్యూటీ సోనాక్షి సిన్హా.. తన ఇంట్లో జరిగిన ఒక వింత సంఘటన, దెయ్యాలపై తనకున్న నమ్మకాన్ని వెల్లడించింది. సోనాక్షి నటించిన మిస్టరీ హారర్-థ్రిల్లర్ సినిమా 'నికితా రాయ్' అనుభవాలతో పాటు హారర్ జానర్‌తో తనకున్న అనుబంధం గురించి మాట్లాడుతూ.. 'మీకు తెలుసా, ఈ దెయ్యాలు, ఆత్మలు, అతీంద్రీయ శక్తులను నేను మొదట్లో అస్సలు నమ్మేదాన్ని కాదు. కానీ ఒకరోజు నా సొంత ఇంట్లోనే నాకు చాలా విచిత్రమైన సంఘటన జరిగింది. పూర్తిగా నిద్రపోకుండా, మెలకువగా ఉన్నట్లు అనిపించే స్థితిలో ఉన్నా టైమ్‌లో అకస్మాత్తుగా ఎవరో నన్ను పైకి ఎత్తుతున్నట్లుగా ఒక చిన్న ఒత్తిడిని అనుభవించాను. అప్పుడు దాదాపు తెల్లవారుజామున 4 గంటల సమయం ఉంటుంది. సగం, సగం నిద్రలో ఉండటంతో అది కలనా లేక నిజమా అని నాకు అర్థం కాలేదు. ఆ క్షణంలో నాకు ప్రాణం పోయినంత పనైంది. భయంతో నేను కళ్లు కూడా తెరవలేదు. అక్కడ ఎవరైనా ఉన్నారో లేదో చూసే ధైర్యం కూడా చేయలేకపోయాను. ఇక తెల్లవారగానే అక్కడ నుంచి పరుగు తీశాను. అయితే.. మరుసటి రాత్రి కూడా ఇంటికి వెళ్లేసరికి లేట్ అయింది. ఆ టైమ్‌లో నేను డోర్ నెమ్మదిగా తీసి.. లోపల ఎవరైనా ఉన్నారా? ఒకవేళ ఉంటే నిన్నటి రాత్రిలాగా తిరిగి రావద్దు. నేను చాలా భయపడ్డాను. ఏదైనా ఉంటే నా కలల్లోకి రా.. ముఖాముఖిగా కూర్చుని మాట్లాడు. ఇవన్నీ చేయకు' అని గట్టిగా మాట్లాడి లోపలికి నడిచి వెళ్లాను. ప్రమాణం చేసి చెబుతున్నా ఆ తర్వాత మళ్లీ అలా ఏమీ జరగలేదు' అంటూ చెప్పుకొచ్చింది.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**